# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 28-10-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 64 పేజీలు:6 వెల: రూ.1/-

## 29న పెద్దశేష వాహనంపై మలయప్ప దర్శనం

తిరుపతి, అక్టోబర్ 27: ఈనెల 29న నాగులచవితి పర్వదినం సందర్భంగా తిరుమలలో శ్రీ మలయప్పస్వామి తిరుమాడ వీధులలో పెద్దశేషవాహనంపై భక్తులకు దర్శమిస్తారని టీటీడీ అధికారులు వెల్లడించారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి సహస్రనామాలతో శేషసాయి, శేషస్తుత్యం, శేషాద్రి నిలయం అంటూ నిత్యపూజలందు కుంటున్నారని చెప్పారు. అటు రామావతారంలో లక్ష్మణుడిగా, కృష్ణావతారంలో బలరామునిగా స్వామివారికి అత్యంత సన్నిహితునిగా వ్యవహరించే ఆదిశేషువు శ్రీవైకుంఠంలోని నిత్యసూరులలో ఆద్యుడని అన్నారు.మలయప్ప స్వామి శ్రీ ఆదిశేషుడిపై ఉభయదేవేరులతో కలిసి ఊరేగుతారని పేర్కొన్నారు. 29న రాత్రి 7 నుంచి 9 గంటల వరకు పెద్దశేష వాహన సేవ జరుగనుందని తెలిపారు.

## మంత్రి మల్లారెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు



మేడ్చల్, అక్టోబర్ 27: మునుగోడు నియోజకవర్గ ప్రజలందరూ టీఆర్ఎస్ వైపే ఉన్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం అరెగూడెంలోని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మంత్రి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి జరిగిందని మునుగోడు ప్రజలంతా భావిస్తున్నారని పేర్కొన్నారు.

ప్రతిపక్ష పార్టీలు మునుగోడులో ఎన్ని డ్రామాలు ఆడినా టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గెలుపు ఖాయమని అన్నారు. అనంతరం మంత్రి మండలంలోని లింగోటం గ్రామంలోని పరిశ్రమలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యాజమాన్యంతో చర్చించారు.

## ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చడమే బీజేపీ లక్ష్యమా..?: మంత్రి తలసాని



మునుగోడు, అక్టోబర్ 27: ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చే కుట్రలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ధ్వజమెత్తారు. మునుగోడులో ఇవాళ ఇంటింటి ప్రచారం నిర్వహించిన ఆయన.. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చడమే బీజేపీ లక్ష్యమా అని ప్రశ్నించారు. మహారాష్ట్ర, గోవా, మధ్యప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కేంద్రంలోని దుర్మార్గపు బీజేపీ ప్రభుత్వం కూల్చిందని విమర్శించారు.

అధికార దాహంతోనే బీజేపీ నేతలు ఇలాంటి దుర్మార్గపు చర్యలకు ఒడిగడుతున్నారని మంత్రి తలసాని దుయ్యబట్టారు. డిల్లీలోని కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ నేతలు యత్నించారని, తెలంగాణలో టీఆర్ఎస్ పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు ప్రయత్నించి అడ్డంగా దొరికిపోయారని చెప్పారు. ఒక్కో ఎమ్మెల్యేకు రూ.100 కోట్లు ఆశచూపారని, ఇన్ని కోట్ల నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయో నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ తీరు దొంగే దొంగదొంగ అన్నట్లుగా ఉందని, ఎందుకంటే చేసిందంతా చేసిన బీజేపీ.. ఇప్పుడు నెపాన్ని రాష్ట్ర ప్రభుత్వంపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వాలు, చట్టాలు, వ్యవస్థల పనితీరు గురించి రాజ్యాంగంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పష్టంగా వివరించారని మంత్రి తలసాని తెలిపారు. బీజేపీ నేతల తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు. ఇకనైనా రాజ్యాంగాన్ని గౌరవించి బీజేపీ నేతలు తమ పద్ధతి మార్చుకోవాలని మంత్రి హితవు పలికారు.

## ఆపరేషన్ ఆకర్ష్ గుట్టు రట్టు చేసిన టీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు..అభినందించిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 27:ఆపరేషన్ ఆకర్ష్ గుట్టుని రట్టు చేశారు నలుగురు టీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు. దాంతో వారిని సీఎం కేసీఆర్ అభినందించారు. కుట్రను బయటపెట్టిన అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు తదితరులతో ముఖ్యమంత్రి కేసీఆర్ గత రాత్రి ప్రగతి భవన్‌లో అత్యవసరంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ ఆకర్ష్' కుట్రను బయటపెట్టిన నలుగురు ఎమ్మెల్యేలను సీఎం అభినందించారు. పైన పేర్కొన్న నలుగురు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు కొందరు ప్రయత్నించారు. మొయినాబాద్ అజీజ్ నగర్‌లోని తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో వారితో బేరసారాలు నిర్వహించారు. పార్టీ మారితే డబ్బు, కాంట్రాక్టులు, పదవులు ఇస్తామని ప్రలోభపెట్టారు. సమాచారం అందుకున్న సైబరాబాద్ పోలీసులు ఢిల్లీలోని ఫరీదాబాద్ ఆలయానికి చెందిన రామచంద్ర భారతి అలియాస్ సతీశ్ శర్మ, సింహయాజి, నందకుమార్‌లను అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు చెప్పారు.

## ఇకపై విద్యుత్ కనెక్షన్‌పై పేరును ఈజీగా మార్చేసుకోండి : సీఎండీ రఘుమారెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 27: విద్యుత్ సర్వీస్ కనెక్షన్ల యాజమాన్య హక్కుల బదలాయింపు ( టైటిల్ ట్రాన్స్‌ఫర్ ) ప్రక్రియను టీఎస్‌పీడీసీఎల్ సులభతరం చేసింది. ఆఫీసుకు వెళ్లకుండా వారం రోజుల్లోనే ఆన్‌లైన్‌లో ప్రక్రియను పూర్తి చేసే వెసులుబాటు కల్పించింది. ఈ విషయాన్ని ఒక పత్రిక ప్రకటనలో టీఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి వెల్లడించారు.

గృహ ( కేటగిరీ -1 ) కనెక్షన్‌కు సంబంధించిన టైటిల్ ట్రాన్స్‌ఫర్ కోసం గుర్తింపు కార్డు, రూ.100 నాన్ జుడీషియల్ స్టాంప్ పేపర్‌పై ధ్రువీకరణ, ప్రస్తుత దరఖాస్తుదారుని పేరు మీద స్వీయ ధ్రువీకరణ లేదా రిజిస్టర్డ్ డీడ్, విల్ డీడ్ వంటి ఏదైనా యాజమాన్య హక్కు ధ్రువీకరణ పత్రం సమర్పించాలని సీఎండీ రఘుమారెడ్డి సూచించారు. గృహేతర ( కేటగిరీ-2) కనెక్షన్ కోసమైతే కంపెనీ అధికార పత్రం, ఉమ్మడి యాజమాన్యం ఉంటే రూ.10 నాన్ జుడీషియల్ స్టాంప్ పేపర్‌పై ఒప్పందం, పాత యజమాని చనిపోతే లీగల్ హెయిర్ సర్టిఫికేట్ పొందుపరచాలని పేర్కొన్నారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తు కోసం www.tssouthernpower.comలో లేదా ఇంటిగ్రేటెడ్ కస్టమర్ సర్వీస్ సెంటర్/ కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు. నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురిచేయొద్దని, దరఖాస్తు చేసిన వారం రోజుల్లో ప్రక్రియ పూర్తిచేయాలని అధికారులను రఘుమా రెడ్డి ఆదేశించారు.

## బీజేపీది దిగజారుడు రాజకీయాలు : ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్



హైదరాబాద్, అక్టోబర్ 27: మునుగోడులో ఓటమి భయంతోనే బీజేపీ దిగజారుడు రాజకీయాలకు తెరదీసిందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని యూసుఫ్ గూడ చౌరస్తాలో నియోజకవర్గానికి చెందిన టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీకి వ్యతిరేకంగా నిరసనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయపార్టీ దిగజారుడు రాజకీయాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు.గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రలోభాలకు గురిచేసేవారని ఇప్పుడు బీజేపీ ఆ నీచ రాజకీయాలకు పాల్పడుతుందని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు ఇలాంటి దుష్ట రాజకీయాలపై తిరుగుబాటు చేస్తారని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు ఎన్ని కుట్రలు చేసినా చివరికి మునుగోడులో టీఆర్ఎస్‌దే విజయమని ధీమాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దేదీప్య విజయ్, రాజ్‌కుమార్ పటేల్, సీఎన్ రెడ్డి , జీటీఎస్ దేవాలయం చైర్మన్ చిన్న రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా జిల్లాలో పేలుడు.. ఒకరి మృతి

అమరావతి: అక్టోబర్ 27: రోజువారి జీవనం కోసం చెత్తకుప్పలపై ఆధారపడ్డ కూలీ పేలుడుతో మృతి చెందిన ఘటన కృష్ణా జిల్లాలో చోటుచేసుకుంది. జిల్లాలోని బాపులపాడు మండలం ఎ.సీతారాంపురం గ్రామంలో పాత ఇనుము కోసం చెత్తకుప్పలో వెతుకుతుండగా ఒక్కసారిగా పేలుడు సంబవించింది. దీంతో పేలుడు ధాటికి పాపారావు(35) అనే కూలీ దుర్మరణం పాలయ్యాడు. పేలుడుకు కారణాలపై వీరవల్లి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.




## ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంపై భగ్గుమన్న టీఆర్ఎస్.. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు



హైదరాబాద్, అక్టోబర్ 27:టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంపై టీఆర్ఎస్ నిరసనలతో హోరెత్తించింది. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు బీజేపీ, ప్రధాని మోదీ దిష్టి బొమ్మలను దహనం చేశారు. మునుగోడు నియోజకవర్గంలోని చండూరులో ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, బాల్క సుమన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బీజేపీ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు.వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం కేంద్రంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ట్రాప్ చేసేందుకు కుట్ర పన్నిన సంఘటనకు వ్యతిరేకంగా నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను పార్టీ నాయకులు దగ్ధం చేశారు.

అనంతరం తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా టీఆర్ఎస్ శ్రేణులు నిరసనలు తెలిపారు. జిల్లా కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపి ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఖమ్మంలోని ఎల్కనూరులో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను టీఆర్ఎస్ నాయకులు కాల్చివేశారు.

ఆసీఫాబాద్ జిల్లా కేంద్రంలో జడ్పీ చైర్ పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు ఆధ్వర్యంలో పీఎం నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలుకు ఎరవేసిన బిజేపి తీరును నిరసిస్తూ సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా టీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మంత్రి హరీష్ రావు క్యాంప్ కార్యాలయం నుంచి బ్లాక్ ఆఫీస్ చౌరస్తా వరకు శవయాత్ర నిర్వహించి.. బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోదీ, అమిత్ షాల దిష్టి బొమ్మ దహనం చేశారు.

### చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

కం॥ ప్రవిమల కమ్యూనిజమును-
నవపథమున నూహాపేసి నాకమ్మ మచున్-
అవనీనాథ ముఖర్జీ
చవిచూపెను వంగసీమ శ్రామికతతికిన్ ॥

(అక్టోబర్ 28 అవనీనాథ ముఖర్జీ జయంతి..)



-రాధశ్రీ

సెల్:9494481210

### అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు: ఎస్పీ డా.వినీత్ .జి

- శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించవద్దు
- నెలవారీ నేర సమీక్షా సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ

భద్రాద్రికొత్తగూడెం, అక్టోబర్ 27 (నేటినిజం ప్రతినిధి) : గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా ఎస్పీ డా.వినీత్. జి పోలీస్ అధికారులతో నెలవారి సమీక్షా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ మరలా ఏదైనా నేరానికి పాల్పడితే వారిపై పీడీయాక్టులను నమోదు చేయాలని సూచించారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్ లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతర నిఘా ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. నిషేధిత గంజాయి అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుని అవసరమైతే పీడీయాక్టులు నమోదు చేయాలని తెలిపారు. నంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాలను సీజ్ చేయాలని తెలిపారు. మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి అట్టి వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు.

# ఆదరణ పెరుగుతున్న ఆనిమేషన్ టెక్నాలజీ

## (28 అక్టోబర్ 'అంతర్జాతీయ ఆనిమేషన్ దినోత్సవం' సందర్భంగా)

మనకు సుపరిచితమైన స్పైడర్ మాన్, మిక్కీ మౌస్, డొనాల్డ్ డక్, టామ్ అండ్ జెర్రీ, ఫిలిమ్ అవతార్, బాహుబలి సినిమా, ఆనిమేషన్ చిత్రాలు లాంటి పాత్రల ప్రభావం మన మనసుల్లో సుస్థిరంగా నాటుకున్నాయి. షార్ట్ వాణిజ్య ప్రకటనలతో మె?దలు పూర్తి నిడివిగల చలన చిత్రాల వరకు ఆనిమేషన్ కళను సృజన జోడించి వినియోగించే స్థాయికి టెక్నాలజీ చేరడం సంతోషదాయకం. సమాజ శ్రేయస్సు కోరే పలు అంశాలను ఆనిమేషన్ కళలో ప్రత్యేకతలుగా సరళంగా, స్పష్టంగా, అర్థవంతంగా, ఆకర్షణీయంగా తక్కువ సమయంలో గొప్ప భావాలను వ్యక్తం చేయడాన్ని చెప్పవచ్చు.

ఇంటర్నేషనల్ ఆనిమేటెడ్ ఫిలిమ్ అసోసియేషన్ చొరవ:

28 అక్టోబర్ 1892లో తొలి సారి పారిస్‌లో ఆనిమేషన్ చిత్రం ప్రదర్శించడం జరిగింది. దీనికి గుర్తుగా ఆనిమేషన్ కళకు పెరిగిన అపార ఆదరణను దృష్టిలో ఉంచుకొని వాణిజ్యరంగం, చలనచిత్రాలలో దాని ప్రాముఖ్యతను వివరించే సదుద్దేశ్యంతో ఇంటర్నేషనల్ ఆనిమేటెడ్ ఫిలిమ్ అసోసియేషన్ నేతృత్వంలో 2002 నుండి ప్రతియేటా 28 అక్టోబర్ రోజున 'అంతర్జాతీయ ఆనిమేషన్ దినోత్సవం' పాటించుట జరుగుచున్నది. ఆనిమేషన్ కళకు సృజనను జోడించి నూతనత్వాన్ని ఆపాదించడం, ఆనిమేషన్ కళ వైపుకు యువతను ఆకర్షించడం, ఆనిమేషన్‌లో వినూత్న భావాలను జోడించడం, ఆనిమేషన్ ఆర్ట్ గుర్చి కార్యశాలలు నిర్వహించడం, ప్రఖ్యాత ఆనిమేషన్ ఫిలిమ్‌లను ప్రదర్శించడం, ఆనిమేషన్ కళ వెనుక దాగిన వైజ్ఞానికశాస్త్రాన్ని వివరించడం, ఆనిమేషన్ కళలో నిష్ణాతులను సన్మానించడం లాంటి అంశాలను చర్చించేందుకు అంతర్జాతీయ ఆనిమేషన్ దినోత్సవ వేదికలను వినియోగించుకుంటారు.

బహుళ ప్రచారం పొందుతున్న కళ:

ప్రపంచవ్యాప్తంగా ఆనిమేషన్ ప్రక్రియకు విద్య, వినోదం, వాణిజ్యం, మార్కెటింగ్, శాస్త్రీయ అవగాహన, సృజనశీల కళ, గేమింగ్, సిమ్యులేషన్, సినిమా, షార్ట్ ఫిల్మ్, మెడికల్, రిటైల్, ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ లాంటి రంగాల్లో అనంతమైన అవకాశాలు, ప్రయోజనాలు ఉన్నాయి. నిజ జీవితాన్ని నకలు చేస్తూ బొమ్మల కదలికలతో చిత్రాలు తీయడాన్ని ఆనిమేషన్ నైపుణ్య కళ అంటారు. వాస్తవికతకు ఊహను జోడించి అందరికీ అర్థం అయ్యేలా సరళ వినోదాత్మక చిత్రాల ద్వారా సందేశాన్ని ఇవ్వడం ఆనిమేషన్ ప్రత్యేకత. స్వల్ప వ్యవధిలో అధిక ప్రభావం చూపగల సామర్థ్యం ఆనిమేషన్ కళకు ఉంటుంది. ఆనిమేషన్‌లో సంప్రదాయ, 2డి, 3డి, మోషన్ గ్రాఫిక్స్, స్టాప్ మోషన్, కటౌట్ అండ్ కల్లాజ్, రోటోస్కోపింగ్, సెల్ ఆనిమేషన్ మె?దలగు రకాలు ఉన్నాయి. సాధారణ జనాలతో కాకుండా వ్యాపారవర్గాలలో కూడా ఆనిమేషన్ కళ ప్రధాన భూమికను నిర్వహిస్తున్నది. డిజిటల్ విప్లవం, అంతర్జాల ప్రభంజనం నేపథ్యంలో ఆనిమేషన్ కళకు అపార ఆదరణ లభించింది. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, ముఖ్యంగా సినిమాలు, టీవీల్లో ఆనిమేషన్ కళ ప్రవేశంతో ఆ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి.

ఆనిమేషన్ కళ ప్రయోజనాలు:

అన్ని వర్గాల, వయసుల ప్రజలను ఆనిమేషన్ కళ ఆకర్షిస్తున్నది. ఆనిమేషన్ వీడియోలతో సందేశాలను సులభంగా ఇవ్వడం, ఊహాత్మక పరిధికి అవధులు లేక పోవడం, సృజనశీలత పెరగడం, వైద్యరంగంలో వినియోగపడడం, ఆకర్షణీయంగా ఉండడం, సులభంగా అవగాహనకు రావడం, వాణిజ్య ప్రకటనలతో ఆకర్షించడం, తేలికగా వేగంగా ప్రజలకు చేరడం, కంటికి ఇంపైన రంగుల చిత్రాలు తీయగలగడం లాంటి ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. 1906లో స్టువార్ట్ బ్లాక్టన్ మె?దటి ఆనిమేషన్ చిత్రం 'హ్యూమరస్ ఫేజెస్ ఆఫ్ ఫన్నీ ఫేసెస్' తీయడం జరిగింది. 1928లో వాల్ట్ డిస్నీ 'స్టీంబోట్ విల్లి' అనబడే ప్రథమ ఆనిమేటెడ్ కార్టూన్ ఫిల్మ్ తీయడం జరిగింది. 1937లో మె?దటి పూర్తి నిడివిగల ఆనిమేటెడ్ 'స్నోవైట్' అనే చలనచిత్రాన్ని వాల్ట్ డిస్నీ తీశారు. 1993లో 3డి ఆనిమేషన్ సాఫ్ట్ వేర్ అందుబాటులోకి వచ్చింది. ఆధునిక యువత ఆనిమేషన్ కళ పట్ల ఆసక్తిని పెంచుకొని, ఆ రంగాన్ని తమ వృత్తిగా ఎంచుకొని, మరింత సృజనను జోడించి ప్రపంచ మానవాళికి నవ్య ఆనిమేషన్ రుచులను చూపుతారని ఆశిద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## స్వచ్ఛతా ప్రచారం మరియు ప్రత్యేక ప్రచారం 2.0లో పాల్గొన్న ఆర్థిక వ్యవహారాల విభాగం

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: ఆర్థిక మంత్రిత్వ శాఖ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అఫైర్స్ (డిఈఏ) దాని సీపీఎస్ఈ, అనుబంధిత, స్వయంప్రతిపత్త సంస్థలతో కలిసి అక్టోబర్ 2 నుండి అక్టోబర్ 31 వరకు పెండింగ్‌లో ఉన్న అంశాల (ఎస్పిపిడిఎం) పరిష్కారానికి స్వచ్ఛత ప్రచారం, ప్రత్యేక ప్రచారం 2.0లో చురుకుగా పాల్గొంటోంది. ప్రత్యేక ప్రచారం 2.0 సమయంలో, డిఈఏ లక్ష్యం పరిశుభ్రత డ్రైవ్, పాత రికార్డులను తొలగించడం, వీఐపి సూచనలు, పార్లమెంట్ హామీలు, పీఎంఓ/రాష్ట్ర ప్రభుత్వాల నుండి సూచనలు, ప్రజా ఫిర్యాదులు, మొదలైన వాటికి సంబంధించి పెండింగ్ అంశాలను పరిష్కరించడం. డిఇఏ కార్యదర్శి స్థాయిలో సమీక్షతో సహా అనేక రౌండ్ల సమావేశాలు జరిగాయి. కార్యకలాపాలను సమన్వయం చేయడానికి, ప్రచారాన్ని విజయవంతం చేయడానికి క్షేత్ర స్థాయిలో బృందాలను ఏర్పాటు చేశారు. ప్రచార సమయంలో, నార్త్ బ్లాక్ కారిడార్‌ల సుందరీకరణ, గదుల పునరుద్ధరణను డిఈఏ చేపట్టింది. సిపిఎస్ఈ ద్వారా డిఈఏ - సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్పిఎంసిఐఎల్) దాని 10 సైట్‌లలో విస్తృతమైన పరిశుభ్రత డ్రైవ్ చేపట్టారు.

## మోడీని ఎదుర్కొనే దమ్ము కేసీఆర్‌కే ఉంది : మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



నల్గొండ, అక్టోబర్ 27: ప్రధాని నరేంద్ర మోడీని ఎదిరించే దమ్ము ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మాత్రమే ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. 18వేల కోట్లకు అమ్ముడుపోయిన రాజగోపాల్ రెడ్డిలాగా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అమ్ముడుపోరు అని, మా ఎమ్మెల్యేలు నిఖార్సైన తెలంగాణ బిడ్డలు అన్నారు. బీజేపీ ప్రలోభాల కుట్రను బట్టబయలు చేసి యావత్ తెలంగాణ సమాజంలో శెభాష్ అనిపించుకున్నారన్నారు.

కేసీఆర్ దేశ రాజకీయాల్లోకి వస్తుంటే దేశ వ్యాప్తంగా ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది. దీన్ని తట్టు–కోలేక ఈ కుట్రకు పూనుకున్నారన్నారు. నలుగురు ఎమ్మెల్యేలను కొని ఇక్కడ ఏమో జరుగుతుందని తెలంగాణ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

ఒక్కో ఎమ్మెల్యేకు 100 కోట్లు– కాంట్రాక్టులు ఇస్తామని ప్రలోభ పెట్టారన్నందుకు అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. ఇతర రాష్ట్రాల్లోని ప్రభుత్వాలను కూల దోసినట్టు– తెలంగాణలో చేస్తామంటే బిడ్డా మీ ఆటలు ఇక్కడ సాగవు అని మండిపడ్డారు. ఇది కేసీఆర్ అడ్డా అంటూ హెచ్చరించారు.

## నెల్లూరు బ్యారేజ్‌కి నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేరు పెడుతున్నాం..సీఎం జగన్



అమరావతి: అక్టోబర్ 27:ఏపీ సీఎం జగన్ నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం నేలటూరిలో పర్యటించారు. జన్కో మూడో యూనిట్ ను ప్రారంభించారు ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి. అనంతరం సీఎం జగన్ మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యుత్ రంగంలో ఇవాళ మరో ముందడుగు వేసినట్లు వెల్లడించారు. అత్యధిక సాంకేతిక టెక్నాలజీ తో ఏపీ జెన్కో ఈ ప్లాంట్ ను నిర్మించిందని.. ఇందుకు జెన్కోకు సీఎం జగన్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లాకి వరాల జల్లు కురిపించారు జగన్. ఎన్నికల సమయంలో సర్వేపల్లి నియోజకవర్గానికి ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు వచ్చానని అన్నారు. రూ. 36 కోట్ల మేర నాన్ ఫిషర్ మెన్ ప్యాకేజ్ ను నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో వేస్తున్నామని అన్నారు. రూ.25 కోట్లతో మిని ఫిషింగ్ హార్బర్ పనులు చేపడుతున్నామన్నారు. పెన్నా నది పై ముదివర్తి వద్ద రూ.93 కోట్ల తో సబ్ మెర్సబుల్ కాజ్ వే నిర్మిస్తామన్నారు.ఎన్నో ఏళ్లుగా అడుగుతున్నా గత ప్రభుత్వాలు వీటిని పట్టించు కోలేదన్నారు సీఎం జగన్. నెల్లూరు బ్యారేజ్ కు నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేరు పెడుతున్నామన్నారు. అందరి మంచి కోసమే ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఉప్పుకాలువ పై హై లెవెల్ బ్రిడ్జి ని మంజూరు చేస్తున్నామన్నారు. నక్కల వాగు పై రూ.10 కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

# సెప్టెంబర్‌లో 25.25 కోట్ల ఆధార్ ఆధారిత ఈ-కేవైసీ లావాదేవీలు- ఆ నెలలో 175 కోట్లకు పైగా అథెంటికేషన్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: దేశవ్యాప్తంగా ప్రజలు నిర్వహిస్తున్న ఆధార్ అనుసంధానిత లావాదేవీలు పెరుగుతున్నాయి. జీవన సౌలభ్యానికి ఆధార్ ఎలా సహాయపడుతుందో ఈ మార్పు సూచిస్తోంది. ఒక్క సెప్టెంబర్ నెలలోనే ఆధార్ ద్వారా 25.25 కోట్ల ఈ–కేవైసీ లావాదేవీలు జరిగాయి. ఆగస్టుతో పోలిస్తే ఇవి దాదాపు 7.7% పెరిగాయి.

ఆధార్ కలిగిన వ్యక్తి ఇచ్చే విస్పష్టమైన సమ్మతితోనే ఈ–కేవైసీ లావాదేవీ జరుగుతుంది. రాత పనిని, వ్యక్తిగత ధృవీకరణ అవసరాన్ని తప్పిస్తుంది.

బ్యాంకింగ్, బ్యాంకింగ్‌యేతర ఆర్థిక సేవల్లో ఆధార్ ఈ–కేవైసీ కీలక పాత్ర పోషిస్తోంది. మెరుగైన, పారదర్శకమైన అనుభవాన్ని అందిస్తుంది. జరగాల్సిన వ్యాపారాన్ని సరళంగా మారుస్తుంది.

2022 సెప్టెంబర్ చివరి నాటికి, ఆధార్ అనుసంధానిత ఈ–కేవైసీ లావాదేవీల సంచిత సంఖ్య 1297.93 కోట్లకు పెరిగింది.

అదేవిధంగా, ఆదాయ పిరమిడ్ దిగువ భాగాన్ని ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఏఈపీఎస్) ఆర్థికంగా బలపరుస్తుంది.

2022 సెప్టెంబరు చివరి నాటికి; ఏఈపీఎస్, మైక్రో ఏటీఎంల నెట్‌వర్క్ ద్వారా 1549.84 కోట్ల లాస్–మైల్ బ్యాంకింగ్ లావాదేవీలు కూడా సాధ్యమయ్యాయి. ఒక్క సెప్టెంబర్‌లోనే దేశవ్యాప్తంగా 21.03 కోట్ల ఏఈపీఎస్ లావాదేవీలు జరిగాయి.

సెప్టెంబర్‌లో, ఆధార్ ద్వారా 175.41 కోట్ల అథెంటికేషన్ లావాదేవీలు జరిగాయి. ఈ లావాదేవీల్లో ఎక్కువ భాగం వేలిముద్రల అథెంటికేషన్‌ను ఉపయోగించి జరిగాయి. దీని తర్వాతి స్థానంలో డెమోగ్రాఫిక్, ఆ తర్వాత ఓటీపీ అథెంటికేషన్ లావాదేవీలు ఉన్నాయి.

సెప్టెంబర్ చివరి నాటికి మొత్తం 8250.36 కోట్ల అథెంటికేషన్ లావాదేవీలు పూర్తయ్యాయి. ఆధార్ ఉద్దేశ్యం ఎంత నిజాయతీగా నెరవేరుతోందో ఈ సంఖ్య సూచిస్తోంది.

మన దేశంలోని వయోజనలకు ఆధార్ కార్డుల జారీ దాదాపుగా సంపూర్ణ స్థాయికి చేరింది. సెప్టెంబర్ చివరి నాటికి, ఆధార్ తీసుకున్న అన్ని వయసుల వారు దేశ మొత్తం జనాభాలో 93.92%గా ఉన్నారు.

ఆధార్ కార్డుదారుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు, సెప్టెంబర్ నెలలో 1.62 కోట్లకు పైగా ఆధార్ కార్డ్ వివరాల నవీకరణలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఆగస్టులో 1.46 కోట్ల నవీకరణలు జరిగాయి.

మొత్తంగా, సెప్టెంబర్ చివరి నాటికి 66.63 కోట్ల ఆధార్ కార్డ్ వివరాలు విజయవంతంగా నవీకరించించారు.

ఈ నవీకరణలు డెమోగ్రాఫిక్, వేలిముద్రల నవీకరణనలకు సంబంధించినవి. భౌతిక ఆధార్ సెంటర్ల ద్వారా, ఆన్‌లైన్ ఆధార్ ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రజలు ఈ తరహా విజ్ఞప్తులు చేసుకున్నారు.

లాస్ట్–మైల్ బ్యాంకింగ్ కోసం ఏఈపీఎస్, ఈ–కేవైసీ, ఆధార్–ఆధారిత డీబీటీ లేదా అథెంటికేషన్.. కార్యకలాపం ఏదైనా, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ డిజిటల్ ఇండియా దార్శనికతకు మద్దతుగా నిలవడంలో ఆధార్ ఒక అద్భుత పాత్రను పోషిస్తోంది.

సుపరిపాలనలో ఒక డిజిటల్ మౌలిక సదుపాయం ఆధార్. అటు జీవన సౌలభ్యం, ఇటు వ్యాపార సౌలభ్యం రెండింటినీ ఇది సులభతరం చేస్తుంది. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా, పారదర్శకంగా మార్చడంలో, లక్షిత లబ్ధిదారులకు వాటిని సక్రమంగా చేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలకు ఈ డిజిటల్ ఐడీ సాయం చేస్తోంది.అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు అమలు చేస్తున్న సుమారు 1000 సంక్షేమ పథకాలను ఆధార్‌తో అనుసంధానించారు.

# శ్రీ విజయ్ వల్లభ్ సురీశ్వర్ జీ 150వ జయంతి ఉత్సవం సందర్భంగా వీడియో ద్వారా సందేశమిచ్చిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: శ్రీ విజయ్ వల్లభ్ సురేశ్వర్ జీ 150 వ జయంతి సందర్భ:గా ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ ఈ కార్యక్రమానికి హాజరైన వారని ఉద్దేశించి వీడియో ద్వారా ప్రసంగించారు. భారతదేశంలో సాధు సంప్రదయాన్ని ముందుకు తీసుకుపోతున్న వారికి, ప్రపంచవ్యాప్తంగా జైన విశ్వాసాన్ని అనుసరిస్తున్న వారికి శిరసు వంచి నమస్కరించారు. ఎంతో మంది సాధువుల మధ్య ఈ సమావేశంలో పాల్గొని వారి ఆశీస్సులు పొందే అవకాశం వచ్చినందుకు ప్రధానమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. తాను గుజరాత్ లో ఉన్నప్పుడు వడోదర, ఛోటా ఉదయ్పూర్లోని కన్వత్ గ్రామంలో సంత్ వాణి వినేందుకు అవకాశం వచ్చిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు.

ఆచార్య శ్రీ విజయ్ వల్లబ్ సురీశ్వర్ జీ 150 వ జయంతి వార్షికోత్సవాల ప్రారంభాన్ని గుర్తుచేసుకుంటూ ప్రధానమంత్రి, ఆచార్య జీ మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం తనకు కలిగినట్టు చెప్పారు. ''ఇవాళ మరోసారి నేను సాంకేతికత సహాయంతో మీ మధ్య ఉన్నాను'' అని ప్రధానమంత్రి అన్నారు.

ఆచార్య శ్రీ విజయ్ వల్లభ్ సురీశ్వర్ జీ స్మారక తపాలా బిళ్లను, నాణాన్ని విడుదల చేసుకున్నామని, ఇది ప్రజలను ఆచార్య శ్రీ విజయ్ వల్లబ్ సురీశ్వర్ మహరాజ్ ఆధ్యాత్మిక చైతన్యాన్ని, ఆయన జీవన తాత్వికతను ప్రజలతో అనుసంధానం చేసేందుకు ఇది దోహదపడుతుందని ప్రధానమంత్రి అన్నారు.

గత రెండు సంత్సరాలుగా జరుగుతున్న ఉత్సవాలు ముగింపునకు వచ్చాయని,ఈ సందర్భంగా ఈ విశ్వాసం , ఆధ్యాత్మికత, దేశభక్తి, జాతీయ శక్తిని పెంపొందించేందుకు సాగిన ప్రచారం అద్భుతమని ప్రధానమంత్రి కొనియాడారు.

ప్రపంచంలోని ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితులను గుర్తుచేస్తూ ప్రధానమంత్రి," ఇవాళ ప్రపంచం యుద్ధ సంక్షోభాన్ని , ఉగ్రవాదం, హింసను ఎదుర్కొంటున్నది. ఈ విషవలయాన్ని విచ్ఛిన్నం చేసేందుకు తగిన ప్రేరణ, ప్రోత్సాహం కోసం ఎదురుచూస్తున్నది" అని ఆయన అన్నారు.

ఇలాంటి పరిస్థితులలో భారతీయ ప్రాచీన సంప్రదాయాలు, తాత్వికత,ఇవాల్టి భారతదేశపు శక్తి ప్రపంచానికి కొత్త ఆశను కల్పిస్తున్నాయని ప్రధానమంత్రి అన్నారు.ఆచార్య శ్రీ విజయ్ వల్లభ్ సురీశ్వర్ చూపిన మార్గం, జైన గురువుల ప్రబోధాలు ప్రపంచం ఎదుర్కొంటున్న సంక్షోభానికి పరిష్కారాలని ప్రధానమమంత్రి అన్నారు.

'' ఆచార్యుల వారు అహింసాయుత , ''ఆచార్య జీ అహింసాయుత , ఏకాంత,సర్వత్యాగమయ జీవితాన్ని అనుసరించడంతోపాటు ఈ భావనలపట్ల ప్రజలలోఓ విశ్వాసాన్ని పెంచేందుకు వారు నిరంతరం కృషి చేయడం మనందరికీ స్ఫూర్తి దాయకం '' అని ప్రధానమంత్రి అన్నారు.

దేశవిభజన సమయంలో జరిగిన దారుణాల సందర్భంగానూ ఆచార్యులవారు శాంతి, సామరస్యం ప్రాధాన్యత గురించి పదే పదే నొక్కి చెప్పారని ప్రధానమంత్రి అన్నారు. దీనితో ఆచార్యుల వారు చాతుర్మాస దీక్షకు విరామం ప్రకటించాల్సి వచ్చిందన్నారు. మహాత్మాగాంధీ సైతం స్వాతంత్రోద్యమ సమయంలో ఆచార్యులవారు సూచించిన అపరిగ్రహ మార్గాన్ని అనుసరించారని ప్రధానమంత్రి గుర్తుచేశారు. అపరిగ్రహ అనేది త్యజించడం మాత్రమే కాదని, అన్ని రకాల బంధాలను నియంత్రించడమని ఆయన అన్నారు.

జైనాచార్య శ్రీ విజయ నిత్యానంద సురీశ్వర జీ ప్రస్తావించినట్టు, గుజరాత్ దేశానికి ఇద్దరు వల్లభ్లను అందించిందని ప్రధానమంత్రి అన్నారు. ఇవాళ ఆచర్యుల వారి 150 వ జయంతి ఉత్సవాలు పూర్తి అవుతున్నాయి. మరి కొద్ది రోజులలో మనం సర్దార్ పటేల్ గారి జయంతి ని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకోబోతున్నాం అని ఆయన అన్నారు. శాంతి విగ్రహం సాధువుల విగ్రహాలలో అతిపెద్దదని, ఐక్యతా విగ్రహం ప్రపంచంలోనే అత్యంత ఎత్తయినదని ప్రధానమంత్రి అన్నారు. ఇవి కేవలం పెద్ద విగ్రహాలు మాత్రమే కాదని, ఇవి ఏక్ భారత్ , శ్రేష్ఠ్ భారత్కు గొప్ప చిహ్నాలని ప్రధానమంత్రి అన్నారు.

ఇద్దరు వల్లభ్ల సేవలను గురించి ప్రస్తావిస్తూ ప్రధానంత్రి, సర్దార్ సాహెబ్ వివిధ సంస్థానాలను విలీనం చేయడం ద్వారా భారత్ ను ఏకం చేశారని అన్నారు. అలాగే ఆచార్యులవారు దేశంలోని వివిధ ప్రాంతాలలో పర్యటించి భారత సంస్కృతి, ఐక్యత, సమగ్రతలను సుసంపన్నం చేశారని ప్రధానమంత్రి అన్నారు.

మన సంప్రదాయాలు, దేశీయ ఉత్పత్తులను ఏకకాలంలో ఎలా ప్రోత్సహించవచ్చో ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి,ఆచార్యజీ మాటలను ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ . " దేశ శ్రేయస్సు దాని ఆర్థిక సుసంపన్నతపైన, దేశీయ ఉత్పత్తుల వాడకంపైన,దేశ సంస్కృతి కళలు, నాగరికతను పరిరక్షించడంలోనూ ఆధారపడి ఉంటుంది'' అని అన్నారు . ఆచార్యులవారు ఎల్లప్పుడూ తెల్లటి ఖాదీ దుస్తులే ధరించేవారని చెప్పారు. ఆజాదీకా అమృత్ కాల్లో స్వదేశీ, స్వావలంబన అనేవి ఎంతో ప్రాముఖ్యత కలిగినవని అన్నారు.

స్వావలంబిత భారతదేశం పురోగతికి ఇదే మంత్రమని ఆయన అన్నారు. అందువల్ల ఆచార్య విజయ్ వల్లభ్ సురీశ్వర్జీ నుంచి ప్రస్తుత ఆచార్య శ్రీ నిత్యానంద సురీశ్వర్ జి వరకు ఈ మార్గాన్ని బలోపేతం చేశారని, మనం దీనిని మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపుని చ్చా రు.

సామాజిక సంక్షేమం, మానవ సేవ, విద్య, ప్రజాచైతన్యం వంటి వాటిని ఆచార్యులు అభివృద్ధి చేశారని , సమాజ సంక్షేమానికి సంబంధించిన ఆ గొప్ప సంప్రదాయాన్నిమరింత ముందుకు తీసుకుపోవలసిన అవసరం ఉందని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు.

"ఆజాదీ కా అమృత్ కాల్ లో మనం అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతున్నాం "అని ప్రధానమంత్రి అన్నారు. ఇందుకు దేశం ఐదు సంకల్పాలను చెప్పుకున్నదని ప్రధానమంత్రి అన్నారు. మని, దీని సాధనలో సాధువుల మార్గనిర్దేశం ముందుకు తీసుకువెళుతున్నదని అన్నారు. .

పౌరుల విధుల కు సంబంధించిన సాధికారతలో సాధువుల మార్గనిర్దేశం ఎన్నటికీ కీలకమైనదని ప్రధానమంత్రి అన్నారు.

వోకల్ ఫర్ లోకల్ ప్రచారంలో ఆచార్యుల పాత్రను వారు ప్రముఖంగా ప్రస్తావించారు.వారివైపు నుంచి ఇది గొప్ప సేవ అని ఆయన అన్నారు. మీలో ఎంతో మంది వ్యాపార రంగంలో ఉన్నారు. మీరు భారత్ లో తయారైన వస్తువులను మాత్రమే వ్యాపారం చేయడానికి సంకల్పం చెప్పుకోండి , ఇది మహారాజ్ సాహిబ్కుగొప్ప నివాళి అవుతుంది అని ఆయన అన్నారు. ఆచార్యశ్రీ మనకు ఈ ప్రగతి మార్గాన్ని చూపారు. మనం దీనిని భవిష్యత్తుకు కు మార్గంగా కొనసాగిద్దాం అని ప్రధానమంత్రి అన్నారు.

## తెలంగాణలో రెండోరోజు కొనసాగుతున్న రాహుల్ భారత్ జోడో యాత్ర

మహబూబ్‌నగర్, అక్టోబర్ 27: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర విజయవంతంగా కొనసాగుతోంది. భారత్ జోడో యాత్ర తెలంగాణలో నిన్న ప్రవేశించింది.

రెండో రోజు భారత్ జోడో యాత్ర ఈ రోజు మక్తల్ నుంచి ప్రారంభమైంది. దండు, కాచ్వార్ మీదుగా బొందలకుంట వరకు యాత్ర కొనసాగనుంది. మధ్యాహ్నం 2.30 గంటలకు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ రైతులతో భేటీ కానున్నారు. ఈ యాత్రలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాహుల్ గాంధీతో కాంగ్రెస్ నాయకులు ముచ్చటించి.. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన ప్రణాళికలను వివరించారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి .జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 27: (నేటినిజం ప్రతినిధి): ఆరోగ్య వంతంగా ఉన్న అన్ని వర్గాలకు చెందిన ప్రజలు రక్త దానం చేసేందుకు ముందుకు వచ్చి ప్రాణదాతలు గా నిలవాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవల్లో భాగంగా ఈ రోజు తదూర్ లోని ఏ. ఆర్ హెడ్ క్వాటర్స్ లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు సిబ్బంది యువకులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రక్తదానంతో ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చని రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు రక్తం అందించడం గొప్పతనమని రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. ఒక్క రక్తదానంతోనే ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ప్రాణదానం చేయడంసాధ్యమవుతుందన్నారు.విధి నిర్వహణలో కర్తవ్యమే లక్ష్యంగా ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులను స్మరిస్తూ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.విధి నిర్వహణలో అమరులైన పోలీసులను ఈ సమాజం ఎప్పటికీ మరువదని, వారి జ్ఞాపకార్థం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజల ధన మాన ప్రాణాలను కాపాడుతూ సంఘవిద్రోహ శక్తుల చేతుల్లో బలైన అమర పోలీసులు వీరులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. సమాజ రక్షణ వీరులు నిరంతర ధీరులు ప్రాణాలను కూడా లెక్కచేయని విధి నిర్వహణ రక్షకులు, ప్రకృతి విలయతాండవం చేస్తే అభయమిచ్చి కాపాడే ఆప్తులు నిద్రించే సమాజానికి నిద్రపోని కాపలాగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు . ఈ శిబిరంలో రక్తదానం చేసిన అధికారులకు, సిబ్బందికి యువ కులను ఎస్పీ అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి,ఆర్.ఐ లు కుమారస్వామి, రజినీకాంత్, యాదగిరి, సి.ఐ అనిల్ కుమార్, ఎస్.ఐ లు ఆర్.ఎస్.ఐ లు పోలీస్ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు...

## భారతదేశం నుండి సంగీత ఉపకరణాల ఎగుమతులలో వృద్ధిని ప్రశంసించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: భారతదేశం నుండి సంగీత ఉపకరణాల ఎగుమతుల లో వృద్ధి నమోదు అయినందుకు గాను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంతోషాన్ని వ్యక్తం చేశారు. 2022వ సంవత్సరం లో ఏప్రిల్ మొదలుకొని సెప్టెంబర్ మధ్య కాలం లో భారతదేశం యొక్క సంగీత యంత్ర వాద్యాల ఎగుమతులు 2013వ సంవత్సరం తో పోలిస్తే 3.5 రెట్ల కంటే అధికం గా పెరిగిపోయాయి.

వాణిజ్యం మరియు పరిశ్రమ శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ చేసిన ఒక ట్వీట్ ను ప్రధాన మంత్రి మరొక ట్వీట్ లో శేర్ చేస్తూ, అందులో –

"ఇది గొప్ప ఉత్సాహజనకం గా ఉన్నది. ప్రపంచం అంతటా భారతీయ సంగీతానికి పెరుగుతున్న లోకప్రియత్వం తో పాటు గా, ఈ రంగం లో మరింత గా ముందుకు పోవడం కోసం ఒక మంచి అవకాశం లభిస్తోంది." అని పేర్కొన్నారు.

## పురుషులతో సమానంగా మహిళా క్రికెటర్లకి మ్యాచ్ ఫీజులు..ప్రకటించిన బీసీసీఐ



న్యూఢిల్లీ, అక్టోబర్ 27: ఇకపై పురుషులతో సమానంగా మహిళా క్రికెటర్లకి మ్యాచ్ ఫీజులు చెల్లించనున్నట్లు ప్రకటించింది బీసీసీఐ. పురుషులు, మహిళా క్రికెటర్ల మ్యాచ్ ఫీజులను సమం చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. క్రికెట్ లో లింగ సమానత్వానికి పెద్దపీట వేస్తున్నామని, మహిళలకూ పురుషులతో సమానంగా ఫీజులు చెల్లించాలని నిర్ణయించామని బీసీసీఐ కార్యదర్శి జైషా ట్వీట్ చేశారు. ఈ నిర్ణయం తీసుకున్న రెండో దేశంగా భారత్ నిలిచింది. గత జులైలో న్యూజిలాండ్ కూడా మహిళా క్రికెటర్లకు పురుషులతో సమానంగా మ్యాచ్ ఫీజు చెల్లించాలని నిర్ణయించింది. ఇకపై మహిళా క్రికెటర్లు ఒక్కో వన్డే మ్యాచ్ కు రూ.6 లక్షలు, టెస్ట్ మ్యాచ్ కు రూ.15 లక్షలు, టీ20 మ్యాచ్ కు రూ.3 లక్షల చొప్పున పారితోషికం అందుకుంటారు. గతంలో వన్డే మ్యాచ్ కు రూ.2 లక్షలు, టెస్ట్ మ్యాచ్ కు రూ.4 లక్షలు, టీ20 మ్యాచ్ కు రూ.2.5 లక్షలను మహిళా క్రికెటర్లు అందుకునే వారు.

# మినికాయ్, థుండి బీచ్‌లకు మరియు కదమత్‌బీచ్ కు 'బ్లూ బీచ్' ల ప్రతిష్ఠాత్మక సూచీలో స్థానం దక్కేటట్టు చూసినందుకు అభినందనలను తెలిపిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: మినికాయ్, థుండి సముద్ర తీరాలు మరియు కదమత్ సముద్ర తీరం 'బ్లూ బీచ్' ల ప్రతిష్ఠిత సూచీ లో స్థానాన్ని సంపాదించుకొన్నందుకు గాను లక్షద్వీప్ ప్రజల కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రత్యేకం గా అభినందనల ను వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అత్యంత పరిశుభ్రమైన బీచ్ లుగా వీటికి పర్యావరణ గుర్తింపు లభించింది. ప్రధాన మంత్రి భారతదేశపు ఉల్లేఖనీయమైనటువంటి కోస్తా తీరాన్ని గురించి నొక్కిచెప్పడం తో పాటు గా కోస్తా ప్రాంత సంబంధి స్వచ్ఛత ను పెంపొందింపచేయడం లో భారతీయులు ప్రదర్శించిన ఉత్సాహాన్ని మెచ్చుకొన్నారు.

పర్యావరణం, అడవులు, జల వాయు పరివర్తన శాఖ కేంద్ర మంత్రి శ్రీ భూపేంద్ర యాదవ్ చేసిన ఒక ట్వీట్ ను ప్రధాన మంత్రి తాను మరొక ట్వీట్ లో శేర్ చేస్తూ "ఇది చాలా బాగుంది. ఈ కార్యసిద్ధి కి గాను విశేషించి లక్షద్వీప్ ప్రజల కు అభినందన లు. భారతదేశపు కోస్తా తీర ప్రాంతం చెప్పుకోదగ్గది. అంతేకాకుండా, కోస్తా తీర ప్రాంత సంబంధి నిర్మలత ను ముందుకు తీసుకుపోయే విషయం లో మన ప్రజల లో ఎంతో ఉత్సాహం కూడా కానవస్తోంది." అని పేర్కొన్నారు.

# శ్రీ కపిలేశ్వరాలయంలో విశేషపూజ హోమ మహోత్సవాలు



తిరుపతి, అక్టోబర్ 27:తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో గణపతి హోమంతో విశేషపూజాహోమ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో నెల రోజుల పాటు- హోమ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. నేడు గణపతి హోం వైభవంగా జరిగింది. గణపతి హోమం చేయడం వల్ల జీవితంలో ఎదురయ్యే విఘ్నాలు తొలగుతాయని అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా పంచమూర్తులకు పాలు, పెరుగు, తేనె, చందనం, విభూదితో విశేషంగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం గణపతిపూజ, పుణ్యాహవచనం, వాస్తుపూజ, పర్యగ్నికరణం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, గణపతి హోమం, లఘుపూర్ణాహుతి నిర్వహించనున్నారు.

అక్టోబరు 28వ తేదీ నుంచి శ్రీ సుబ్రమణ్యస్వామివారి హోమం..

శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో అక్టోబరు 28 నుండి 30వ తేదీ వరకు శ్రీసుబ్రమణ్య స్వామివారి హోమం మూడు రోజుల పాటు-ఘనంగా జరుగనుంది. అక్టోబరు 30న సాయంత్రం 5.30 గంటలకు శ్రీ సుబ్రమణ్యస్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. కాగా, అక్టోబరు 31న శ్రీ దక్షిణామూర్తి స్వామివారి హోమం, నవంబరు 1న శ్రీ కాలభైరవ స్వామివారి హోమం, నవంబరు 2న శ్రీ నవగ్రహ హోమం, నవంబరు 3 నుంచి 11వ తేదీ వరకు శ్రీ కామాక్షి అమ్మవారి హోమం (చండీయాగం), నవంబరు 12 నుంచి 22వ తేదీ వరకు శ్రీ కపిలేశ్వరస్వామివారి హోమం(రుద్రయాగం), నవంబరు 22న శ్రీ శివపార్వతుల కల్యాణం చేపడతారు. నవంబరు 23న శ్రీ చండికేశ్వరస్వామివారి హోమం, త్రిశూలస్నానం, పంచమూర్తుల ఆరాధన నిర్వహిస్తారు. గృహస్తులు రూ.500/ చెల్లించి ఒక రోజు హోమంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదం అందజేస్తారు. పవిత్రమైన కపిలతీర్థంలోని శ్రీకపిలేశ్వరస్వామివారి క్షేత్రంలో హోమాల్లో పాల్గొనడం ఎంతో పుణ్యఫలమని అర్చకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ దేవేంద్రబాబు, ఏఈవో శ్రీ శ్రీనివాసులు, సూపరింటె-ండెంట్లు శ్రీ భూపతి, శ్రీ శ్రీనివాసులు, -టె-ంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ బాలక్రిష్ణ, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గుంటూరు మిర్చికి మస్త్ గిరాకీ, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వలు ఖాళీ.. మేలు రకం క్వింటా రూ.31వేలు

అమరావతి: అక్టోబర్ 27: గుంటూరు మిర్చికి అంతర్జాతీయంగా విపరీతమైన డిమాండ్ పెరిగింది. మిర్చి దిగుబడులపై తెగుళ్ళ ప్రభావం దిగుబడిపై చూపినా.. ధరలు ఎగబాకడంతో రైతులు, వ్యాపారులకు లాభాలపంట పండింది. రైతుల వద్ద ఉన్న మిర్చి సరుకులో మూడొంతులు విక్రయాలు జరిగిన తర్వాత మార్కెట్ ఊపందుకోవడం కొంతమేర బాధాకరం. రైతుల వద్ద నుంచి వ్యాపారుల చేతుల్లోకి మారిన తర్వాత శీతలగిడ్డంగులో సరుకు రేటు అమాంతంగా పెరిగింది. ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన గుంటూరు మర్చియార్డుకు ఒక గుంటూరు జిల్లా నుంచే కాకుండా పల్నాడు, తెలంగాణ జిల్లాల నుంచి సరుకు దిగుమతి అవుతోంది.

ఇక్కడ స్పైసెస్‌పార్కులో లావాదేవీలు జరడగం వ్యాపారులకు మరింత కలిసొచ్చిన అంశంగా చెప్పవచ్చు. పల్నాడు జిల్లా యడ్లపాడు సమీపంలోని మైదవోలులో 125 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన సుగంధ ద్రవ్యాల పార్కు ఫలాలు అందుతున్నాయి. పార్కులో సుమారు రూ.120 కోట్ల వ్యయంతో పలు ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పడంతో ఎగుమతులకు మార్గం సుగమమైంది. సాధారణంగా ప్రతి ఏడాది సీజన్‌లో 30శాతం వరకు మర్చిని ఆశించిన రేటుకోసం శీతలగిడ్డంగుల్లో నిల్వ ఉంచుతారు. గుంటూరు పరిసర ప్రాంతాల్లోని వందకుపైగా ఉన్న శీలగిడ్డంగుల్లో ఉన్న పదిలక్షల క్వింటాళ్ళ మిర్చి పూర్తిస్థాయిలో విక్రయాలు జరగడం ఇదే తొలిసారి అని వ్యాపారులు చెబుతున్నారు.

## ఇతర రాష్ట్రాల్లో డిమాండ్

కొద్ది రోజులుగా ధరలు పెరుగుతున్నా ఈ ఏడాది సీజన్‌లో గరిష్టంగా రూ.18 వేలు దాటలేదు. ఇప్పుడు అన్ సీజన్లో రికార్డు స్థాయిలో ధరలు పెరగడం విశేషం. గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా తామర తెగులు సోకి పంట దెబ్బతినీ, దిగుబడి తగ్గడం వల్ల కొన్ని రోజులుగా గుంటూరు మిర్చికి ఇతర రాష్ట్రాల్లో గిరాకీ పెరిగింది. రాష్ట్రంలోని వివిధ కోల్డ్ స్టోరేజీల్లో ఇంకా 10 లక్షల టిక్కీలు నిల్వ ఉన్నాయి. కొత్త సరుకు రావడానికి ఇంకా రెండు నెలలు సమయం ఉంది. దీంతో గతేడాది సాగు చేసిన మిర్చిని కోల్డ్ స్టోరేజీల్లో దాచుకున్న వ్యాపారులు లాభపడ్డారు.

గతేడాది ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టు-కొని రాష్ట్రంలో ఈ ఏడాది మిర్చి విస్తీర్ణం 30 శాతం వరకు తగ్గింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 1.80 లక్షల ఎకరాల్లో సాధారణ విస్తీర్ణం కాగా ఈ ఏడాది ఇప్పటి వరకూ 1.40 లక్షల ఏకరాలోనే సాగైంది. ఈ ఏడాది ధరలు గణనీయంగా పెరుగుతున్నా మిర్చి సాగుకు రైతులు ఆచి తూచి వ్యవహరించారు. మరోవైపు ఇప్పటికే దాదాపు 10 వేల ఎకరాల్లో వర్షాలకు పైరు దెబ్బతింది. పల్నాడు జిల్లాలో కూడా కొంత మంది రైతులు మరో నెల రోజులు ఆగిన తర్వాత మిర్చి సాగు వైపు దృష్టి సారించాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు.

ప్రధానంగా అధిక వర్షాలతో ఇబ్బందులు రాకుండా, ఎండ తీవ్రత పెరిగితే తెగులు ప్రభావం అంతగా ఉండదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. గుంటూరు మిర్చి యార్డులో బుధవారం ధరలు గణనీయంగా పెరిగాయి. 355 రకం క్వింటాళ్ రూ.31000 పలికింది. 5531 రకం రూ.30 వేలు, దేవదారు డీలక్స్ రూ.29,500, 273 రకం రూ.29 వేలు, నంబర్ 5 రకం రూ.29,000 ధర పలకగా 334 సూపర్ వెరైటీ- రూ.27,500, నంబర్ 5 రకం రూ.29 వేలు, 334 సూపర్ వెరైటీ- రూ.27,500, తేజ రకం రూ.23,700, ఆర్మూర్ రూ.23,500 ధరలు పలికాయి.

# కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ నరేంద్ర సింగ్ తోమర్ సహ అధ్యక్షతన వ్యవసాయ అటవీశాఖపై జరిగిన 7వ ఆసియాన్ భారత్ మంత్రివర్గ సమావేశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: వ్యవసాయం మరియు అటవీశాఖపై 7వ ఆసియాన్ భారత్ మంత్రుల సమావేశం (ఏఐఎంఎంఏఎఫ్) ఈరోజు వర్చువల్‌గా జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ నరేంద్ర సింగ్ తోమర్ అధ్యక్షత వహించారు. బ్రూనై దారుస్సలాం, కంబోడియా, ఇండోనేషియా, లావో పీడీఆర్, మలేషియా, మయన్మార్, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్ మరియు వియత్నాం వ్యవసాయ శాఖ మంత్రులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సమావేశం సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ నరేంద్ర సింగ్ తోమర్ తన ప్రారంభ వ్యాఖ్యలలో భారతదేశ యాక్ట్ ఈస్ట్ పాలసీలో ఆసియాన్‌ను కేంద్రంగా ఉంచాలన్న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆలోచనను పునరుద్ఘాటించారు. స్థిరమైన మరియు సమ్మిళిత వృద్ధిని నిర్ధారించడానికి ఆసియాన్‌తో పరస్పర సన్నిహిత ప్రాంతీయ సహకారాన్ని కూడా ఆయన నొక్కిచెప్పారు. మిల్లెట్ (పోషక-తృణధాన్యాలు) పౌష్టికాహారం మరియు అంతర్జాతీయ పోషక తృణధాన్యాల సంవత్సరం 2023 గురించి ప్రస్తావిస్తూ మిల్లెట్ ఉత్పత్తి, ప్రాసెసింగ్, విలువ జోడింపు మరియు వినియోగాన్ని పెంచడంలో భారతదేశం చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వాలని ఆసియాన్ సభ్య దేశాలను శ్రీ తోమర్ కోరారు. ప్రజల ఆరోగ్యం మరియు పౌష్టికాహారం కోసం భారతదేశం పోషకమైన తృణధాన్యాల ఉత్పత్తులను ప్రోత్సహిస్తుందని శ్రీ తోమర్ అన్నారు. పోషకమైన తృణధాన్యాలు తక్కువ వనరుల అవసరం మరియు మరింత సమర్థవంతమైన వ్యవసాయ ఆహార వ్యవస్థలతో పోషకాలను సృష్టించడంలో సహాయపడతాయన్నారు.

ఈ సమావేశంలో ఆసియాన్ ఇండియా కోఆపరేషన్ (2021-2025 సంవత్సరం) మధ్యకాలిక కార్యాచరణ ప్రణాళిక కింద వివిధ కార్యక్రమాలు మరియు కార్యకలాపాల అమలులో పురోగతిని సమీక్షించారు. ఆసియాన్ భారత్ సంబంధాల 30వ వార్షికోత్సవాన్ని కూడా ఈ సమావేశం స్వాగతించింది. ఈ సమావేశంలో వ్యవసాయం మరియు అటవీ రంగాలలో ఆసియాన్-భారత్ సహకారానికి నిబద్ధతను పునరుద్ఘాటించారు. కోవిడ్-19 మహమ్మారి ప్రభావాన్ని తగ్గించడానికి, ఆసియాన్ మరియు భారతదేశానికి సురక్షితమైన మరియు పోషకమైన వ్యవసాయ ఉత్పత్తుల అవాంతరాలు లేని సప్లైని నిర్ధారించడానికి, ఆసియాన్-భారత్ సహకారంతో నిరంతర చర్యలు తీసుకోవడం అవసరమని సమావేశం అభిప్రాయపడింది. ఆహార భద్రత, పోషకాహారం, వాతావరణ మార్పుల అనుకూలత, డిజిటల్ వ్యవసాయం, ప్రకృతి అనుకూల వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్, వాల్యూ చైన్, వ్యవసాయ మార్కెటింగ్ మరియు సామర్థ్య నిర్మాణంలో ఆసియాన్‌తో భారతదేశ సహకారాన్ని పెంపొందించడానికి భారత్ కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి శ్రీ తోమర్ తెలిపారు.

# ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ 7వ వార్షిక సమావేశానికి ఈరోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ, అక్టోబర్ 27: ఈరోజు న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ 7వ వార్షిక సమావేశానికి కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ హాజరయ్యారు.

ప్రతి సంవత్సరం వార్షిక సమావేశంలో, ఏఐఐబీ, భవిష్యత్తు కార్యక్రమాలకు సంబంధించిన ముఖ్యమైన విషయాలపై కీలక నిర్ణయాలు తీసుకోవడానికి గవర్నర్ల బోర్డు సమావేశమవుతుంది. ఏఐఐబీలో భారత్ వ్యవస్థాపక సభ్యునిగా రెండవ అతిపెద్ద వాటాదారు. ఏఐఐబీలో భారతదేశ అతిపెద్ద ప్రాజెక్ట్ పోర్ట్‌ఫోలియోను కూడా కలిగి ఉంది. ఈ సంవత్సరం వార్షిక సమావేశం ఇతివృత్తం "సస్టైనబుల్‌న్ఫ్రాస్ట్రక్చర్ టువర్డ్ ఎ కనెక్టెడ్ వరల్డ్".

"సంక్షోభం-పీడిత ప్రపంచంలో ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్" అనే అంశంపై గవర్నర్ రౌండ్ టేబుల్ చర్చలో ఆర్థిక మంత్రి తన ఆలోచనలను పంచుకున్నారు. సభ్యులకు సహాయం చేయడానికి, అధిక-నాణ్యత అభివృద్ధి ఫైనాన్స్ అందించడానికి ఏఐఐబీ నిరంతర నిబద్ధత, అంకితభావాన్ని ఆర్థిక మంత్రి ప్రశంసించారు. ప్రధాన నిర్మాణాత్మక సంస్కరణలు, గట్టి ఎక్స్‌టర్నల్ బ్యాలెన్స్ షీట్‌తో కూడిన భారతదేశం మంచి-లక్ష్య విధాన మిశ్రమం దాని వృద్ధిని నిలకడగా ఉంచడానికి సహాయపడిందని సీతారామన్ పేర్కొన్నారు. భారతదేశం స్వావలంబన ఆర్థిక వ్యవస్థ మార్గాన్ని ప్రారంభించిందని, అందువల్ల మహమ్మారి ప్రతికూల ప్రభావాలను తగ్గించడంలో విజయం సాధించిందని ఆర్థిక మంత్రి ఉద్ఘాటించారు. భారతదేశం తన డిజిటలైజేషన్ మిషన్ ద్వారా సాధించిన అద్భుతమైన పురోగతిని, సామాజిక రక్షణను సులభతరం చేయడానికి, ఆర్థిక చేరికను పెంచడానికి సాంకేతికతను ఉపయోగించడాన్నిశ్రీమతి సీతారామన్ నొక్కిచెప్పారు. 'పర్యావరణానికి జీవనశైలి' (లేదా లైఫ్) వంటి అనేక కార్యక్రమాల ద్వారా భారతదేశ వాతావరణ మార్పుల ప్రతిస్పందన ప్రయత్నాలకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ చురుగ్గా నాయకత్వం వహిస్తున్నారని ఆర్థిక మంత్రి ప్రధానంగా ప్రస్తావించారు.

అర్థవంతమైన ప్రభావం, వనరులు బహుళ రంగాలలో ఒక డ్రామా పద్ధతిలో ఉండేలా చూసుకోవడానికి, ఏఐఐబి క్లీన్ ఎనర్జీ, ఎనర్జీ ఎఫిషియన్సీ, విపత్తు తట్టుకునే మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం, డిజిటల్ మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టితో సామాజిక మౌలిక సదుపాయాలతో సహా కీలకమైన ప్రాధాన్యత రంగాలలో పెట్టుబడులను పెంచాల్సిన అవసరం ఉందని ఆర్థిక మంత్రి సూచించారు.

సభ్యుల విస్తారమైన మౌలిక సదుపాయాల అవసరాలను తీర్చడానికి ప్రభుత్వ వనరులు మాత్రమే సరిపోవు కాబట్టి, విభిన్న ప్రైవేట్ రంగ వనరులను సమీకరించడంలో బ్యాంక్ ఉత్ప్రేరక పాత్ర పోషించడమే కాకుండా, దాని స్వంత వనరులను పెంపొందించుకునే యంత్రాంగాలను అన్వేషించాలని ఆర్థిక మంత్రి సలహా ఇచ్చారు.

ఎండిబి క్యాపిటల్ అడిక్వసీ ఫ్రేమ్‌వర్క్ (సిఏఎఫ్)పై జి 20 నిపుణుల ప్యానెల్ నివేదిక సిఫార్సులు పరిగణలోకి తీసుకోవాలని అన్నారు.

బ్యాంకు సభ్య దేశాల్లో పూర్తి స్థాయి కార్యాలయాలను ఏర్పాటు చేయాలని సీతారామన్ సూచించారు. ఆర్థిక మంత్రి ఏఐఐబి తన నిర్దేశిత మిషన్‌ను సాధించడంలో భారతదేశ నిరంతర సహకారానికి హామీ ఇచ్చారు.

# హర్యానాలోని సూరజ్‌కుండ్‌లో కేంద్ర హోం మరియు సహకార మంత్రి శ్రీ అమిత్ షా అధ్యక్షతన జరగనున్న రాష్ట్ర హోంశాఖ మంత్రుల "చింతన్ శివిర్'

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: హర్యానాలోని సూరజ్‌కుండ్‌లో కేంద్ర హోం మరియు సహకార మంత్రి శ్రీ అమిత్ షా అధ్యక్షతన రాష్ట్ర హోంశాఖ మంత్రుల "చింతన్ శివిర్' 2022 అక్టోబర్ 27 మరియు 28 తేదీలలో హర్యానాలోని సూరజ్‌కుండ్‌లో జరగనున్నది. సదస్సును ఉద్దేశించి 2022 అక్టోబర్ 28న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగిస్తారు.

రెండు రోజుల పాటు జరగనున్న "చింతన్ శివిర్' అన్ని రాష్ట్రాల హోం మంత్రులు మరియు లెఫ్టినెంట్ గవర్నర్లు మరియు కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలకులు పాల్గొంటారు. రాష్ట్ర హోం కార్యదర్శులు , డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మరియు కేంద్ర సాయుధ పోలీసు దళం డైరెక్టర్ జనరల్ మరియు కేంద్ర పోలీసు సంస్థల సెంట్రల్ పోలీస్ ఆర్గనైజేషన్స్ డైరెక్టర్ జనరల్ చింతన్ శివిర్‌లో పాల్గొంటారు. "విజన్ 2047" అమలు, స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రకటించిన పంచప్రాన్ అమలు కోసం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయడం లక్ష్యంగా "చింతన్ శివిర్' ఏర్పాటయింది. సైబర్ నేరాల అదుపు, దర్యాప్తుకు అవసరమైన వ్యవస్థను అభివృద్ధి చేయడం, పోలీసు బలగాల ఆధునీకరణ, నేర న్యాయ వ్యవస్థ లో ఐటీ వినియోగం పెంచడం , భూ సరిహద్దు నిర్వహణ మరియు తీరప్రాంత భద్రత మరియు ఇతర అంతర్గత భద్రత వంటి అంశాలపై "చింతన్ శివిర్' లో

రాష్ట్ర హోం శాఖల మంత్రులు చర్చలు జరుపుతారు. '2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం" నిర్మాణంలో కీలకం కానున్న మహిళలకు భద్రత కల్పించి రక్షణ కల్పించేందుకు అమలు చేయాల్సిన చర్యలపై ప్రత్యేకంగా సదస్సు దృష్టి సారించనుంది. సమన్వయంతో సమగ్ర ప్రణాళిక రూపకల్పన, జాతీయ పోలీసు విధానం రూపకల్పనకు సదస్సు రంగం సిద్ధం చేస్తుంది.

'చింతన్ శివిర్' లో ఆరు సెషన్లలో వివిధ అంశాలపై చర్చిస్తారు. సదస్సు తొలిరోజు హోంగార్డులు, సివిల్ డిఫెన్స్, ఫైర్ ప్రొటెక్షన్, శత్రువుల ఆస్తులు వంటి పలు ముఖ్యమైన అంశాలపై చర్చిస్తారు. రెండో రోజున సైబర్ భద్రత, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, మహిళల భద్రత మరియు సరిహద్దు నిర్వహణ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా తో సహా ఎన్డిపిఎస్ చట్టం, నిధాన్, ఔఅూఖీఅ, ముక్త్ భారత్ అభియాన్ కు సంబంధించిన ఇతర ముఖ్యమైన అంశాలు చర్చకు వస్తాయి. ల్యాండ్ బోర్డర్ మేనేజ్‌మెంట్ మరియు కోస్టల్ సెక్యూరిటీ అనే ఇతివృత్తాల క్రింద సరిహద్దుల రక్షణ మరియు సరిహద్దు ప్రాంతాల అభివృద్ధి అంశాలపై చర్చలు జరుగుతాయి ఎఅమా ఉ అఅుబొా సిస్టమ్‌లు మరియు ఎి మాడ్యూల్‌లను ఉపయోగించి సాంకేతికత ఆధారిత పరిశోధన ద్వారా నేరాలు చేసిన వారికి శిక్ష పడుతున్న రేటును పెంచడానికి అమలు చేయాల్సిన చర్యలను సదస్సు చర్చిస్తుంది. సేఫ్ సిటీ ప్రాజెక్ట్, 112-సింగిల్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టమ్, జిల్లాల్లో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లు, పోలీస్ స్టేషన్లలో మహిళా హెల్ప్ డెస్కులు, మత్స్యకారులకు బయోమెట్రిక్ గుర్తింపు కార్డులు వంటి కార్యక్రమాలపై కూడా చర్చలు జరుగుతాయి. అన్ని సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేసి, లక్ష్యాలను సాధించేందుకు అమలు చేయాల్సిన చర్యలు కూడా సదస్సులో ప్రధానంగా చర్చకు రానున్నాయి.

# ఏపీకి వర్ష సూచన.. రానున్న మూడు రోజుల్లో వానలు..!

అమరావతి: అక్టోబర్ 27: ఏపీలో రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో ఏపీలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం దుందని తెలిపింది. పశ్చిమ మధ్య, దానిని ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఇప్పుడు నైరుతి బంగాళ ాఖాతం మీదుగా ఉత్తర తమిళనాడు తీరంలో సగటు- సముద్రంపై 1.5 కి.మీ నుంచి 4.5 కి.మీ మధ్యఉండి కొనసాగుతున్నది.

బంగాళాఖాతం మీదుగా దిగువ ట్రోపోస్పిరిక్ స్థాయిలలో ఈశాన్య గాలులు ఏర్పడే అవకాశం ఉంది. దక్షిణ ఇంటీ-రియర్ కర్ణాటక నుండి తమిళనాడు మీదుగా నైరుతి బంగాళాఖాతం వరకు ద్రోణి సముద్ర మట్టానికి సగటు- 0.9 కి మీ ఎత్తు వద్ద ఉన్నది ఇపుడు బలహీన పడినది. ఈ నేపథ్యంలో ఏపీలో రాబోవు మూడు రోజులకు వాతావరణ సూచనలు చేసింది

# గులాబీ శ్రేణుల నిరసన..



కరీంనగర్, అక్టోబర్ 27 (నేటినిజం ప్రతినిధి): టీఆర్ఎస్ (బీఆర్ఎస్) పార్టీ ఎమ్మెల్యేల కొనుగోలు బేరసారాలకు ప్రయత్నించి ప్రభుత్వాన్ని కూల్చే కుట్రచేసిన బీజేపీ పార్టీ నీచపనికి నిరసనగా మంత్రి గంగుల కమలాకర్ ఆదేశాల మేరకు గురువారం తెలంగాణ చౌక్‌లో టీఆర్ఎస్(బీఆర్ఎస్) పార్టీ నాయకులు, నగర మేయర్ వై.సునీల్ రావు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి.. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయం చైర్మన్ అనిల్, టీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రాలహోం మంత్రుల చింతన్ శిబిర్‌లో అక్టోబర్28వ తేదీన పాలు పంచుకోనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: రాష్ట్రాల హోం మంత్రుల చింతన్ శిబిర్ ను ఉద్దేశించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2022 అక్టోబర్ 28వ తేదీ న ఉదయం దాదాపు గా పదిన్నర గంటల కు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రసంగించనున్నారు. ఈ చింతన్ శిబిరాన్ని 2022 అక్టోబర్ 27వ, 28వ తేదీల లో హరియాణా లోని సూరజ్ కుండ్ లో ఏర్పాటు చేయడం జరుగుతోంది. ఈ చింతన్ శిబిరం లో వివిధ రాష్ట్రాల హోం శాఖ కార్యదర్శులు మరియు పోలీసు డైరెక్టర్ జనరల్స్ (డిజిపి లు) మరియు కేంద్ర సాయుధ పోలీసు దళాలు (సిఎపిఎఫ్ లు) మరియు కేంద్ర పోలీసు సంస్థ (సిపిఒ) ల డైరెక్టర్ జనరల్స్ కూడా పాల్గొంటారు.

ఈ హోం మంత్రుల చింతన్ శిబిరం అనేది స్వాతంత్ర్య దినం సందర్భం లో ప్రధాన మంత్రి ప్రకటించిన పంచ్ ప్రణ్ కు అనుగుణం గా అంతర్గత భద్రత కు సంబంధించిన అంశాల పై విధాన రూపకల్పన పై జాతీయ దృక్పథాన్ని అందించడానికి జరుగుతున్న ఒక ప్రయాస గా ఉంది. సహకారాత్మక సమాఖ్య భావన కు తగినట్లుగా ఈ శిబిరం కేంద్రం, రాష్ట్రాల స్థాయి లో వివిధ స్టేక్ హోల్డర్స్ మధ్య ప్రణాళిక, ఇంకా సమన్వయం లో అధిక అవగాహన కు బాట ను పరచనుంది.

పోలీసు బలగాల ఆధునికీకరణ, సైబర్ అపరాధాల ను అరికట్టడం, అపరాధిక న్యాయ వ్యవస్థ లో పెరుగుతున్న ఐటి ఉపయోగం, భూ సరిహద్దు నిర్వహణ. తీరప్రాంతాల భద్రత, మహిళల భద్రత, మాదక పదార్థాల అమ్మకం, రవాణా లేదా చట్టవ్యతిరేకమైన మాదకద్రవ్యాల దిగుమతి ల వంటి అంశాల పై ఈ శిబిరం లో చర్చించడం జరుగుతుంది,

# బీజేపీ కుట్రను నిరసిస్తూ ధర్నా.. ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం



కరీంనగర్, అక్టోబర్ 27 (నేటినిజం ప్రతినిధి): తెరాస ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ పన్నిన కుట్రలను నిరసిస్తూ తెరాస పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కమాన్ చౌరస్తా వద్ద రాజీవ్ రహదారిపై ధర్నా చేపట్టిన అనంతరం ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ దాసరి మమతరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య బద్ధంగా తెరాస పార్టీ నుంచి ఎన్ని-కై-న నలుగురు ఎమ్మెల్యేలను ప్రజాస్వామ్య విరుద్ధంగా కోట్లాది రూపాయలతో కొనుగోలు చేసేందుకు సిద్ధపడడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ప్రజల అభిమానం పొందలేకనే ఇలాంటి నీచ రాజకీయాలకు తెర తీస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ కుట్రలను తెరాస ఎమ్మెల్యేలు తిప్పి కొట్టడం గర్వంగా ఉందన్నారు. ఇప్పటి-కై-నా బీజేపీ పార్టీ పద్ధతి మార్చుకోవాలని, రానున్న రోజుల్లో తెలంగాణ ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెరాస పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, తెరాస కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఢిల్లీ పర్యటనలో ఏపీ హోంమంత్రి.. నేడు, రేపు కేంద్ర హోంశాఖ చింతన్ శిబిర్



న్యూఢిల్లీ, అక్టోబర్ 27: 'విజన్ 2047' లక్ష్యంగా కేంద్ర హోంశాఖ ఏర్పాటు చేసిన చింతన్ శిబిర్ (మేథోమథనం)లో ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి తానేటి వనిత పాల్గొననున్నారు. గురు, శుక్రవారాల్లో హర్యానాలోని సూరజ్‌కుండ్‌లో జరగనున్న ఈ సదస్సుకు అన్ని రాష్ట్రాల హోంమంత్రులు, డీజీపీలు, హోంశాఖ ఉన్నతాధికారులను కేంద్ర హోంశాఖ ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఈ సదస్సులో పాల్గొనేందుకు ఒక రోజు ముందుగానే ఏపీ హోంమంత్రి తానేటి వనిత ఢిల్లీ చేరుకున్నారు. బుధవారం ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్, అదనపు రెసిడెంట్ కమిషనర్ హిమాన్షు కౌశిక్‌తో ఆమె సమావేశమయ్యారు.

సదస్సు ఎజెండా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున మాట్లాడాల్సిన అంశాలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ గురించి అధికారులతో చర్చించారు. హోంశాఖ చింతన్ శిబిర్ సదస్సులో హోంమంత్రి తానేటి వనితతో పాటు హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా, రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు హాజరవుతారని ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సును ఉద్దేశించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రసగించనున్నారు. "విజన్ 2047" కోసం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయడం లక్ష్యంగా ఈ సదస్సు ఏర్పాటైంది. ప్రధాని నరేంద్ర మోడీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రకటించిన పంచప్రాణ్‌లో భాగంగా కేంద్ర హోంశాఖ ఈ సదస్సును ఏర్పాటు చేసింది. హోంశాఖ సదస్సులో సైబర్ క్రైమ్ మేనేజ్‌మెంట్ కోసం తగిన వ్యవస్థను అభివృద్ధి చేయడం, పోలీసు బలగాల ఆధునీకరణ, నేర న్యాయ వ్యవస్థలో ఐటీ వినియోగం పెరగడం, సరిహద్దు నిర్వహణ, తీరప్రాంత భద్రత మరియు అంతర్గత భద్రతకు సంబంధించిన ఇతర ముఖ్యమైన అంశాలపై చర్చించనున్నారు. పోలీసింగ్‌లో అనేకాంశాల్లో దేశవ్యాప్తంగా ఆదర్శప్రాయంగా నిలుస్తున్న తెలుగు రాష్ట్రాల పోలీసు యంత్రాగం ఈ సదస్సులో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్నట్టు తెలిసింది.

ముఖ్యంగా అంతర్గత భద్రతలో భాగమైన వామపక్ష తీవ్రవాదం (మావోయిస్టులు) సమస్యను ఎదుర్కొనే విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పోలీసులు పటిష్టమైన ఇంటెలిజెన్స్ వ్యవస్థ, గ్రేహౌండ్స్ వంటి సుశిక్షిత బలగాల విషయంలో గత కొన్నేళ్ల నుంచి ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయి. జాతీయస్థాయి సదస్సుల్లో తమ తమ రాష్ట్రాల్లో చేపట్టిన అనేక చర్యల గురించి వివరించాయి. అలాగే సైబర్ నేరాలను ఎదుర్కొనే విషయంలోనూ తెలుగు రాష్ట్రాల పోలీసులు ముందంజలో ఉన్నారు. వీటిపై ప్రజంటేషన్ ఇవ్వనున్నట్టు తెలిసింది.

# బీసీల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ ధ్యేయం.. చరిత్రలో నిలిచేలా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు




అమరావతి: అక్టోబర్ 27:బీసీల అభ్యున్నతే ధ్యేయంగా, బీసీ ఉపకులాల రాజకీయ సాధికారతకు కృషిచేసిన ఏకైక పార్టీగా వైఎస్సార్ సీపీ చరిత్రలో నిలుస్తుందని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. రాష్ట్ర జనాభాలో 50శాతంపైగా ఉన్న వెనుకబడిన కులాల(బీసీ)అభ్యున్నతి కోసం పార్టీ ఇప్పటి వరకు చేసిన కృషి గతంలో ఏ ప్రభుత్వ పాలనలోనూ చూడలేదన్నారు. మూడున్నరేళ్ల పాలనలో బీసీల కోసం చేపట్టిన పథకాలు, కార్యక్రమాలపై బీసీ అగ్రనేతలతో చర్చించేందుకు బుధవారం విజయవాడలో వైఎస్సార్ సీపీ బీసీ నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించింది. సమావేశంలో స్పీకర్ తమ్మినేని సీతారాం, వైఎస్సార్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, విడదల రజిని, సీదిరి అప్పలరాజు, కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ మార్గాని భరత్, పార్టీ బీసీ వింగ్ ప్రెసిడెంట్ జంగా కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సభలో ఎంపీ విజయసాయి రెడ్డి మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి కోసం భవిష్యత్తులో ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. బీసీ సామాజిక వర్గంలోని ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రత్యేక రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. గత టీడీపీ పాలనలో బీసీల అభివృద్ధిని గాలికి వదిలేశారని, చంద్రబాబు కేవలం రాజకీయాల కోసం బీసీలను ఉపయోగించుకున్నారని విమర్శించారు. అందుకోసమే బీసీ వర్గాల ఆర్థిక, రాజకీయ అభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలు అమలు చేసినట్లు వివరించారు.

రాష్ట్రంలో ప్రస్తుతం 139 బీసీ ఉపకులాలు ఉన్నట్లు తెలిపారు. బీసీలకు లబ్ధి చేకూర్చేందుకే నామినేటెడ్ పోస్టుల్లో అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు వివరించారు. ఓబీసీ రిజర్వేషన్ బిల్లును వైఎస్సార్ సీపీ రాజ్యసభలో ప్రవేశపెట్టిన అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీసీల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై ఇకపై జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహిస్తామన్నారు.

స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ గత మూడున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బీసీల కోసం చేసింది ప్రారంభం మాత్రమేనని పేర్కొన్నారు. బీసీ ఇతర వెనుకబడిన కులాల రాజకీయ, ఆర్థిక సాధికారతకు కృషి చేస్తున్న సీఎం జగన్ సంఘసంస్కర్తగా చరిత్రలో నిలుస్తారన్నారు. సీఎం జగన్ దార్శనిక నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత బీసీ నేతలపైనే ఉందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 225 మంది బీసీ నేతలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

మెదక్, అక్టోబర్ 27: నేటినిజం (ప్రతినిధి): ప్రాథమిక పాఠశాలల్లో చదువుచున్న ప్రతి విద్యార్థి ఈ విద్యా సంవత్సరం ముగిసే నాటికి ధారాళంగా చదవడం, వ్రాయడం, కూడికలు, తీసివేతలు వంటి లెక్కలు చేయడంలో, విషయం పరిజ్ఞానం సముపార్జించుటలో ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని విద్యా శాఖ సంయుక్త కార్యదర్శి హరిత అన్నారు. ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ తొలిమెట్టు కార్యక్రమాన్ని చేపట్టిందని, దీన్ని ఉపాధ్యాయ వర్గం సమర్థవంతంగా అమలు చేయాలని హితవు చెప్పారు.

గురువారం కలెక్టరేట్ లోని ఆడిటోరియం లో తొలిమెట్టు (ఈఒఔ), మన ఊరు మన బడి కార్యక్రమాల ప్రగతిని ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలు, స్కూల్ మేనేజిమెంట్ కమిటి చైర్మన్ లు, హెడ్మాస్టర్లు, అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సమీక్షిస్తూ అధ్యాపకులు ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలకు రెగ్యులర్ గా చెబుతున్న పాఠాలతో పాటు వారికి అర్థమయ్యే రీతిలో సులభతరంగా పాఠ్యంశాలు బోధిస్తూ ప్రణాళికాబద్ధంగా బేసిక్స్ మాథ్స్ పై పట్టు సాధించేలా చూడాలని కోరారు. ప్రైవేట్ విద్యాసంస్థల కన్నా ప్రభుత్వ విద్యా సంస్థలలో ఉన్నత చదువులు చదివి, ప్రావీణ్యత గల అధ్యాపకులున్నారని వారంతా తమ భాధ్యతగా 1 నుండి 5 వ తరగతి ప్రాథమిక స్థాయి పిల్లలలో కనీస అభ్యసన లో వంద శాతం ప్రావీణ్యులయ్యేలా చూడాలని అన్నారు. రాష్ట్రంలోని 5 వేల పాఠశాలలలో లైబ్రరీ కార్నర్ లు ఏర్పాటు చేసి పుస్తకాలు అందుబాటులోకి తెచ్చుటకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మన ఊరు మన బడి కార్యక్రమాన్ని సమీక్షిస్తూ నిధుల కొరత లేదని పాఠశాల మేనేజిమెంట్ కమిటీ, ప్రధానోపాధ్యాయుడు, సర్పంచు, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ లు సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలో గుర్తించిన 313 పాఠశాలలో శౌచాలయాలు, కిచెన్ షేడ్స్, ప్రహారి గోడ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలన్నారు. పనులు చేసిన వాటికి వెంటవెంటనే ఎం.బి. రికార్డు చేసి ఎఫ్.టి.ఓ. లో నమోదు చేసిన పనులకు నిధులు మంజూరు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమం నందే గాక ఉపాధి హామీ పథకం క్రింద కూడా ప్రహరి గోడ నిర్మాణం వంటి పనులు చేపట్టవచ్చని కొందరు అడిగిన ప్రశ్నలకు సమాధానాం చెప్పారు.

ఈ కార్యక్రమం క్రింద 30 లక్షల లోపు, 30 లక్షల పైన ఉన్న పనులు చేపట్టవలసి ఉండగా పనుల పురోగతి ఆశించిన స్థాయిలో జరగడం లేదని, వేగవంతం చేయాలని, 30 లక్షలకు పైగా పనులు ఉన్న వాటికి టెండర్లు పిలిచి వెంటనే పనులు మొదలు పెట్టాలని అన్నారు. సర్పంచులు ముందుకు రాని దగ్గర థర్డ్ పార్టీ తో పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఏమైనా సాంకేతిక సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తెస్తే రాష్ట్ర సాంకేతిక బృందం సహకారంతో పరిష్కరిస్తామని అన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.హరీష్ మాట్లాడుతూ పిల్లలలో లోటుపాట్లను గమనించి వారిలో కనీస అభ్యసన పట్ల నైపుణ్యం పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని అన్నారు. పాఠాలు చెబుతుంటే పిల్లలలో అనుభూతికలగాలని, ఉత్సుకతతో మరింత తెలుసుకోవాలి, నేర్చుకోవాలన్న జిజ్ఞాస కలగాలని, ఆ దిశగా పక్క ప్రణాళిక ప్రకారం బోధించాలని సూచించారు. మ్యాథమెటిక్స్, సైన్స్ వంటి బేసిక్ పాఠ్యంశాలను ప్రయోగ రూపంలో చెబితే వారి మనస్సుకు హత్తుకొని నేర్చుకోవాలనే కుతూహలం ఉంటుందని, అట్టి విషయాలు మర్చిపోకుండా ముందుకెళ్తారని, ఆ దిశగా ఉపాధ్యాయులు వృత్తిపట్ల అంకితభావంతో పిల్లలకు పాఠాలు బోధించాలని అన్నారు. ఇందుకోసం సీనియర్ అధికారులకు శిక్షణ కూడా ఇచ్చామని, ఏ పాఠశాలలో లోటుపాట్లు ఉన్నాయో గుర్తించి ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అన్నారు. మన ఊరు మనబడి కార్యక్రమం క్రింద గుర్తించిన పాఠశాలలో పనులు ఎంత వరకు జరిగాయి, సమస్యలు ఏమైనా ఉన్నాయా, చేసిన పనులకు ఏం.బి. రికార్డు చేసారా అని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సమస్యలుంటే తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని విద్యాశాఖాధికారికి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ పరీక్షల సంచాలకులు కృష్ణారావు, సమగ శిక్ష అదనపు సంచాలకులు రమేష్, తొలిమెట్టు రాష్ట్ర నోడల్ అధికారి సువర్ణ వినాయక్, రాష్ట్ర ఏ.ఎం.ఓ. గోపాల్, డీఈఓ రమేష్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి రాజి రెడ్డి, ఎంఈఓ లు, పాఠశాల మేనేజిమెంట్ కమిటీ చైర్మన్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలు, తదితరులు పాల్గొన్నారు.




# నవశకం ఆరంభం, కలసికట్టుగా పనిచేద్దాం.. పదవీ బాధ్యతలు చేపట్టిన ఖర్గే



న్యూఢిల్లీ, అక్టోబర్ 27: సుదీర్ఘ రాజకీయ చరిత్ర కల్గిన కాంగ్రెస్ (ఏఐసీసీ)లో నవశకం మొదలైంది. రెండు దశాబ్దాల అనంతరం గాంధీయేతర కుటుంబం నుంచి పగ్గాలు చేతులు మారాయి. ఇటీవల జరిగిన పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మల్లికార్జున ఖర్గే బుధవారం ఉదయం పదవీ బాధ్యతలు చేపట్టారు. కాంగ్రెస్ తాజా మాజీ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ సీనియర్ నేతలు పలువురు హాజరయ్యారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్లు, సీఎల్పీ నేతలను ఆహ్వానించగా, 'భారత్ జోడో' యాత్ర ఏర్పాట్లలో నిమగ్నమైనవారు మినహా దాదాపుగా అందరూ హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన వారిలో మధుయాష్కి గౌడ్, పొన్నం ప్రభాకర్, పొన్నాల లక్ష్మయ్య, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సురేశ్ షెట్కార్, గిడుగు రుద్రరాజు, సర్వే సత్యనారాయణ, టి. సుబ్బిరామిరెడ్డి, జేడీ శీలంతో పాటు యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ సహ వివిధ అనుబంధ సంఘాల నేతలున్నారు.

న్యూఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరయ్యే ముందు మల్లికార్జున ఖర్గే మొదట రాజ్‌ఘాట్ సందర్శించారు. అక్కడ మహాత్మ గాంధి సమాధి వద్ద నివాళులు అర్పించిన ఖర్గే, అనంతరం మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి, రాజీవ్ గాంధీ స్మారక ప్రదేశాలతో పాటు మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ స్మారక స్థలాలను కూడా ఆయన సందర్శించారు. అనంతరం ఏఐసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేదికపై చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ అథారిటీ ఛైర్మన్ మధుసూదన్ మిస్త్రీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన పత్రాన్ని మల్లికార్జున ఖర్గేకు అందజేశారు. వందేమాతర గీతాలాపనతో ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని జనగణమనతో ముగించారు.

## పార్టీ ముఖ్య నిర్ణయాల్లో సోనియా పాత్ర కొనసాగుతుంది: కేసీ వేణుగోపాల్

కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సోనియా గాంధీని కోల్పోతున్నామని, అయినప్పటికీ పార్టీ తీసుకునే ముఖ్య నిర్ణయాల్లో ఆమె అనుభవాన్ని, పాత్రను ఎప్పటికీ కోల్పోమని ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు. మల్లికార్జున ఖర్గే పదవీ బాధ్యతలు చేపట్టే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి రాజకీయ నాయకుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడతారని, కానీ ప్రజాస్వామ్యం మాత్రం కాంగ్రెస్ లోనే ఉందని వ్యాఖ్యానించారు. పార్టీ కొత్త అధ్యక్షుడిగా ఖర్గే బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందని, ఆయన పార్టీ కోసం గత 50 ఏళ్లుగా సేవలు అందజేస్తున్నారని గుర్తుచేశారు. 9 పర్యాయాలు వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొంది, కర్నాటక అసెంబ్లీలో విపక్ష నేతగా, పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్ష నేతగా పనిచేశారని తెలిపారు. సుదీర్ఘ రాజకీయానుభవం కల్గిన ఖర్గే పార్టీ పగ్గాలు చేపట్టడం గొప్ప పరిణామంగా ఆయన అభివర్ణించారు.

## కలసి నడుద్దాం.. సవాళ్లను అధిగమిద్దాం: సోనియా గాంధీ

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జున ఖర్గేకు అభినందనలు తెలియజేసిన సోనియా గాంధీ దేశంలో నెలకొన్న అప్రజాస్వామిక పాలన ఎదుర్కోవడమే పార్టీ ముందున్న అసలైన సవాల్ అని వ్యాఖ్యానించారు. ఖర్గే పదవీ బాధ్యతలు చేపట్టే కార్యక్రమంలో మాట్లాడిన ఆమె, ఖర్గే కింది స్థాయి నుంచి ఎదిగిన నేతగా కొనియాడారు. ఖర్గే నేతృత్వంలో ముందుకు సాగుతుందనే విశ్వాసం తనలో ఉందని అన్నారు. పార్టీని బలమైన వ్యవస్థగా నిలబెట్టేందుకు నిరంతరం పనిచేశారని ఆశిస్తున్నట్టుగా వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు చేపట్టడం ఒక సవాలుగా అభివర్ణించిన సోనియ, గతంలోనూ పార్టీకి అనేక సవాళ్లు ఎదురయ్యాయని, అందరూ కలిసి ఐకమత్యంగా వ్యూహాత్మకంగా వాటిని ఎదుర్కోవడంలో సఫలీకృతమయ్యామని గుర్తుచేశారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రస్తుత, భవిష్యత్తు సవాళ్లను అధిగమిద్దామంటూ ఆమె పార్టీ శ్రేణులను పిలుపునిచ్చారు.

## కార్మికుడి కొడుకు అధ్యక్షుడయ్యాడు.. మల్లికార్జున ఖర్గే భావోద్వేగం

ఒక కార్మికుడి కొడుకు, సామాన్య కార్యకర్త నుంచి ప్రస్థానాన్ని ప్రారంభించి పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం తనకు గర్వంగా ఉందని మల్లికార్జున ఖర్గే అన్నారు. పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైనట్టు సర్టిఫికెట్ అందుకున్న అనంతరం వేదికపై నుంచి మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. 1969లో కాంగ్రెస్ లో తన జీవితం ప్రారంభమైందని, ఎంతోమంది రాజకీయవేత్తలతో కలిసి పనిచేసే అవకాశం తనకు దొరికిందని గుర్తుచేసుకున్నారు. రాజ్యాంగాన్ని కాపాడడం తన బాధ్యత అని, అందుకోసం పోరాడేందుకు పోరాడేందుకు అందరూ సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. సోనియా నేతృత్వంలో రెండుసార్లు యూపీఏ సర్కార్ అధికారంలోకి వచ్చిందని, ఆ సమయంలోనే కాంగ్రెస్ కీలకమైన సంస్కరణలు తీసుకొచ్చిందని గుర్తుచేశారు. రాజస్థాన్‌లో జరిగిన చింతన్ శిబిర్‌లో సోనియా ఆలోచన నుంచి తీసుకొచ్చిన బ్లూప్రింట్‌ను అమలుచేస్తామని ఖర్గే అన్నారు. దేశ రాజ్యాంగాన్ని పరిరక్షించడమే కాంగ్రెస్ లక్ష్యమని ఆయనన్నారు. 137 ఏళుగా కాంగ్రెస్ దేశంలోని బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడుతోందని, 'భారత్ జోడో' యాత్రతో మరోసారి రాహుల్ పేద వర్గాల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారని అన్నారు.

పార్టీలో భారత్ జోడో యాత్ర ఒక కీలకమైన ఘట్టం అని ఆయన అభివర్ణించారు. ఈ యాత్రలో రాహుల్ వెంట నడిచేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజానీకం ఉత్సాహం చూపుతున్నారని అన్నారు. హిమాచల్, గుజరాత్ రాష్ట్రాల్లో ఎన్నికలు రాబోతున్నాయని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలమైన పోటీనిస్తుందని ఆయన తెలిపారు. రాహుల్ ఎప్పుడూ చెప్పే 'డరో మత్' (భయపడకు) నినాదంతో ముందుకెళ్లామని అన్నారు. ఏదేమైనా లడేంగే (పోరాడదాం), జీతెంగే (గెలుద్దాం) అంటూ ఆయన నినదించారు. తమ పోరాటం పార్టీ కోసం, ప్రజల కోసం, దేశ భవిష్యత్ కోసం తప్ప వ్యక్తుల కోసం కాదని ఖర్గే తెలిపారు.

## నవశకానికి నాంది: తెలుగు నేతలు

కాంగ్రెస్ చరిత్రలో నవశకానికి నాంది పలికామని తెలుగు రాష్ట్రాల కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యానించారు. ఏఐసీసీ కార్యాలయంలో సందడి చేసిన తెలుగు నేతలు, మల్లికార్జున ఖర్గే బాధ్యతలు చేపట్టడాన్ని స్వాగతించారు. సుదీర్ఘ రాజకీయానుభవం కల్గిన ఖర్గే నాయకత్వం, 2 దశాబ్దాలుగా పార్టీకి నాయకత్వం వహించిన సోనియా గాంధీ అనుభవం, మార్గదర్శకత్వం పార్టీకి రెండింతల బలాన్నిస్తాయని అన్నారు. పూర్తి ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించి మరీ కొత్త అధ్యక్షుణ్ణి ఎన్నుకోవడం ఏ పార్టీలోనూ లేదని కొందరు వ్యాఖ్యానించారు. కొత్త-పాత, అనుభవం-యువతరం మేళవించిన సరికొత్త కూర్పుతో పార్టీ సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతోందని అన్నారు.

## అగ్గిపెట్టె శాలువాతో సత్కారం

ఏఐసీసీ కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జున ఖర్గేను మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అగ్గిపెట్టె శాలువాతో సత్కరించారు. బుధవారం మధ్యాహ్నం ఖర్గేను ఆయన నివాసంలో కలిసిన పొన్నం ప్రభాకర్ తెలంగాణలోని సిరిసిల్లలో పట్టుదారంతో చేనేత మగ్గాలపై నేసిన శాలువాను అగ్గిపెట్టెలో పెట్టి తీసుకొచ్చారు. సిరిసిల్ల చేనేత నైపుణ్యాన్ని చాటడంతో పాటు కొత్త అధ్యక్షుడిపై అభిమానాన్ని చాటుకునేందుకు ఆయన ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. ఆయనతో పాటు మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ కూడా ఉన్నారు. ఖర్గే నాయకత్వంలో, గాంధీ పరివారం దిశానిర్దేశంతో పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కలసికట్టుగా పనిచేస్తామని వారు తెలిపారు. 'భారత్ జోడో' యాత్ర గురువారం నుంచి తెలంగాణలో పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో సాయంత్రానికి ఢిల్లీ నుంచి తిరుగుప్రయాణమయ్యారు.

## కాంగ్రెస్ అగ్రనాయకత్వం రాజీనామా

ఏఐసీసీ నూతన అధ్యక్షుడిగా ఖర్గే పదవీ బాధ్యతలు చేపట్టిన కాసేపటికే పార్టీ జాతీయ కార్యవర్గం మొత్తం రాజీనామా చేసింది. ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ట్వీట్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇంచార్జులు తమ పదవులకు రాజీనామా చేశారని పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షుడు మారినప్పుడు కార్యవర్గం మొత్తం రాజీనామా చేయడం ఆనవాయితీ అని, కొత్త అధ్యక్షుడు తనకు అనుకూలమైన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకుంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. కొత్త కార్యవర్గంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలకు 50 శాతం వరకు చోటు కల్పించనున్నట్టు తెలిసింది. ఆ మేరకు మార్పులు చేర్పులు జరగనున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో 50 శాతం వరకు కొత్త అధ్యక్షుడు తనకు నచ్చినవారిని నామినేట్ చేస్తారని, మిగతా 50 శాతం పదవులను ఎన్నికల ద్వారా భర్తీ చేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

తొలుత వర్కింగ్ కమిటీ కూర్పు జరుగుతుందని, అనంతరం వారిలో నుంచి కొందరిని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులుగా తీసుకుంటారని తెలిపారు. అలా ప్రధాన కార్యదర్శులైనవారికి వివిధ రాష్ట్రాల బాధ్యతలు అప్పగిస్తారు. ఈ కసరత్తుతో పాటు వివిధ రాష్ట్రాల్లో పీసీసీ నాయకత్వంలో మార్పులు, చేర్పులు చేసే అధికారాన్ని ఏఐసీసీకి కట్టబెడుతూ ఇప్పటికే అన్ని రాష్ట్రాల పీసీసీలు తీర్మానం చేసి పంపాయి. తొలుత ఏఐసీసీ నాయకత్వ కసరత్తు పూర్తి చేసి, ఆ తర్వాత వివిధ రాష్ట్రాల పీసీసీ నాయకత్వంలో మార్పులు, చేర్పులు చేసే అవకాశం ఉంది.

# అంతర్ జిల్లా ట్రాన్స్‌ఫార్మర్ దొంగల ముఠా అరెస్ట్..



కరీంనగర్, అక్టోబర్ 27 (నేటినిజం ప్రతినిధి): ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి పాల్పడుతున్న ముఠాను పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. 31 ట్రాన్స్‌ఫార్మర్లు దొంగలించిన నిందితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుండి నేరం చేసేందుకు ఉపయోగించిన వాహనాలతో పాటు 2.07 క్వింటాళ్ల కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం పెద్దపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ చెన్నూరి రూపేష్ నిందితుల వివరాలను వెల్లడించారు. శుక్రవారం ఉదయం నమ్మదగిన సమాచారం మేరకు సుల్తానాబాద్ ఎస్సై ఉపేందర్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మండలంలోని కనుకుల వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన బసంత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన పందరి రఘు, పందరి నరేష్, పందరి వెంకటేశంతో పాటు- ధర్మారం మండలం ఖిలావనపర్తికి చెందిన మౌటం కుమార స్వామిలను అదుపులోకి తీసుకున్నారన్నారు. వారి వద్ద నుండి కాపర్ వైరు స్వాధీనం చేసుకొని విచారణ ప్రారంభించారన్నారు. విచారణలో 9 మంది ముఠాగా ఏర్పడి పెద్దపల్లి జిల్లా ధర్మారం పోలీస్ స్టేషన్ పరిధిలో 18, బసంత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2, అంతర్గాం పోలీస్ స్టేషన్ పరిధిలో 3, సుల్తానాబాద్‌లో 1, జూలపల్లిలో 1, జగిత్యాల జిల్లా వెల్గటూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 6 ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసి అందులోని కాపర్ వైర్‌ను అమ్ముకున్నట్లు- గుర్తించామన్నారు. అనంతరం బసంత్ నగర్ ఎస్ఐ మహేందర్, ధర్మారం ఎస్సై శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పాటు- చేసి మొత్తం తొమ్మిది మంది నిందితులతో పాటు ఇద్దరు కొనుగోలు దారులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుండి 2.07 క్వింటాళ్ల కాపర్ వైరు, ఒక కారు, ఒక టాటా ఏసీతో పాటు 6 ద్విచక్ర వాహనాలు, వేయింగ్ మెషిన్, కాపర్ వైర్ తీసేందుకు ఉపయోగించిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

ట్రాన్స్ ఫార్మర్ల చోరీకి పాల్పడిన పందరి రఘు, పందరి నరేష్, పందరి వెంకటేశం, వేంపల్లి సతీష్, ధర్మాజీ ప్రభాకర్, అరుగుల శ్రీకాంత్, ముచ్చర్ల ప్రశాంత్, పందరి రాజేందర్, అరుగుల రజనీకాంత్‌తో పాటు- కాపర్ వైర్ కొనుగోలు చేసిన మౌటం కుమార స్వామి, పస్తం హనుమంతులను అదుపులోకి తీసుకున్నామన్నారు. గత కొన్ని నెలలుగా పెద్దపెల్లి జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు పెరగడంతో రామగుండం పోలీస్ కమిషనర్ చంద్ర శేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు పెద్దపల్లి ఏసీపీ సారంగపాణి, సుల్తానాబాద్ సీఐ ఇంద్రసేన రెడ్డి, పెద్దపల్లి సీఐ ప్రదీప్ కుమార్‌లు ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై దృష్టి సారించారన్నారు. ఈ క్రమంలోనే ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి పాల్పడుతున్న ముఠాను అదుపులోకి తీసుకున్నామన్నారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే సంబంధిత పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి పాల్పడుతున్న ముఠా గుట్టును రట్టు చేసిన ఏసీపీ, సీఐలను సుల్తానాబాద్ ఎస్సై ఉపేందర్, ధర్మారం ఎస్ఐ శ్రీనివాస్, బసంత నగర్ ఎస్సై మహేందర్, ఏఎస్ఐ తిరుపతి, సిబ్బంది తిరుపతి నాయక్, అనిత్, గణ?ష్, సుందర్, సతీష్, రవీందర్‌లను అభినందించడంతో పాటు- నగదు రికార్డులను అందజేశారు. మీడియా సమావేశంలో ఏసీపీ సారంగపాణి, సీఐలు ఇంద్రసేనారెడ్డి, ప్రదీప్ కుమార్‌తో పాటు- ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

# చేనేత వస్త్రాలపై జీఎస్టీని రద్దు చేయాలి



కరీంనగర్, అక్టోబర్ 27 (నేటినిజం ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాల పై విధించిన ఐదుశాతం జీఎస్టీని రద్దు చేయాలని ధర్మారం మండలం ఖిలా వనపర్తి గ్రామ చేనేత పవర్ లూమ్ కార్మికులు, పద్మశాలీలు డిమాండ్ చేశారు . టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర జౌళి శాఖ మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపు, తెలంగాణ సంక్షేమ శాఖ మంత్రికొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు ప్రధాని మోదీకి పోస్టుకార్డులను రాశారు.

ఇప్పటికే కేంద్ర విధానాలతో చేనేత కార్మికులు ఆర్థికంగా కుంగిపోయిన దశలో జీఎస్టీ మరింత పెనుభారం కానుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మారం మండలంలోని ఖిలా వనపర్తి పద్మశాలీ సంఘం గ్రామ అధ్యక్షుడు చెన్నూరి సత్యనారాయణ, మండల కన్వీనర్ కూరపాటి శ్రీనివాస్, నందల మల్లేషం, గ్రామ సర్పంచ్ సాగంటి తార కొండయ్య, సభ్యులు సిరిపురం కిషన్ కొండ బత్తుల నరేష్ గౌడ్, భాస్కర్, కొండబత్తుల అజయ్, ఒడ్నల సంతోశ్ తదితరులు పాల్గొన్నారు .

# ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చెబుతున్న విధంగా ఏ2047 భారతదేశం నిర్మాణాన్ని కొత్త యువ ఓటర్లు శాసిస్తారు .. కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్



న్యూఢిల్లీ, అక్టోబర్ 27: ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ చెబుతున్న విధంగా ఏ2047 భారతదేశం నిర్మాణాన్ని కొత్త యువ ఓటర్లు శాసిస్తారని కేంద్ర (స్వతంత్ర బాధ్యత)శాస్త్ర సాంకేతిక, భూ శాస్త్ర, సిబ్బంది వ్యవహారాలు, ప్రజా ఫిర్యా దులు, పెన్షన్లు, అణుశాస్త్రం, అంతరిక్ష శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నా రు. ఉత్తరప్రదేశ్ లోని మొరాదా బాద్‌లో కొత్త మరియు యువ ఓటర్లను ఉద్దేశించి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు మాట్లాడారు. ఉత్తరప్రదేశ్‌లో మొత్తం ఓటర్లలో 18-30 ఏళ్ల మధ్య వయస్సులో ఉన్న దాదాపు 55 మిలియన్ల మంది యువకులు మరియు మహిళలు ఉన్నారని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. రాష్ట్రంలో మొత్తం ఓటర్లలో వీరి సంఖ్య దాదాపు 37% వరకు ఉందని అన్నారు. 10 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇటీవల రోజ్‌గార్ మేళా ప్రారంభించారని యువ ఓటర్లకు డాక్టర్ జితేంద్ర సింగ్ గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉద్యోగాలు పొందిన 75,000 మందికి నియామక పత్రాలు అందించారని అన్నారు. 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతుందని డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించడం దాదాపు అసాధ్యమని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. పరిస్థితిని గుర్తించి యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా అంకుర సంస్థలు, ఇతర వ్యవస్థాపక మార్గాలపై దృష్టి సారిం ఓచాలని మంత్రి సూచించారు. ఎక్కువ ఉపాధి అవకాశాలు అందించే వ్యవసాయ, ప్రైవేటు రంగం, ఎంఎస్ఎంఈ వంటి రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రధానమంత్రి సూచించారని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందించేందుకు ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కింద కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని అన్నారు. పరిశ్రమల అవసరాలు దృష్టిలో ఉంచుకుని శిక్షణ ఇస్తామని తెలిపారు. ఇంతవరకు దేశవ్యాప్తంగా 1.25 కోట్ల మందికి వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చామని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

ప్రభుత్వం అనుసరిస్తున్న సరళీకృత విధానాల వల్ల దేశంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయని డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడించారు. సరళీకృత డ్రోన్ విధానం అమలు, అంతరిక్ష రంగాన్ని ప్రైవేటు రంగానికి అందుబాటులోకి తేవడం, ముద్ర యోజన కింద అందించిన 20 లక్షల కోట్ల విలువ చేసే రుణాల వల్ల యువతకి అపారమైన కొత్త అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని మంత్రి వివరించారు. 2014 లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి యువశక్తి అభివృద్ధికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు." 2018 జనవరి 1 సాధారణ రోజు కాదు. ఈ దశాబ్దంలో జన్మించిన వారు 18 వ సంవత్సరంలోకి అడుగుపెడతారు. వీరి జీవితాల్లో 2018 నిర్ణయాత్మక సంవత్సరంగా ఉంటుంది. 21వ శతాబ్దంలో మన దేశ విధి (భాగ్య విధాత) సృష్టికర్తలు కాబోతున్నారు. నేను ఈ యువకులందరినీ హృదయ పూర్వకంగా స్వాగతిస్తున్నాను, వారిని గుర్తించి వారికి నా నివాళులర్పిస్తున్నాను. మన దేశ భవిష్యత్తును తీర్చిది ద్దే అవకాశం మీకు ఉంది. గర్వించదగిన దేశం దాని అభివృద్ధి ప్రయాణంలో భాగం కావాలని మిమ్మల్ని ఆహ్వానిస్తుంది". అంటూ 2017 ఆగస్టు 15 వ తేదీన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ గుర్తు చేశారు.



## బీజేపీని ఓడించేందుకు చేనేత కార్మికులు సిద్ధం కావాలి

నీలగిరి, అక్టోబర్ 27: చేనేత వస్త్రాలపై జీఎస్టీ విధించి ఇతర ముడి సరుకుల ధరలను పెంచిన బీజేపీని ఓడించేందుకు చేనేత కార్మికులు సిద్ధం కావాలని నల్గొండ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జిల్లా మార్కండేయులు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంజి మురళీధర్ పిలుపునిచ్చారు. గురువారం మునుగోడు మండలంలోని కొరటికల్ గ్రామంలో చేనేత కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణకు మద్దతు తెలుపుతూ రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

మునుగోడు ఉపఎన్నికలలో చేనేత కార్మికులంతా ఐక్యంగా ఉండి టీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం చేనేత రంగాన్ని నిర్వీర్యం చేస్తూ చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ విధిస్తూ నేతన్నల నడ్డి విరుస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్ల ఉపాధ్యక్షుడు కర్నాటి శ్రీరంగం, టీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి ఐతగోని లాల్ బహదూర్ గౌడ్,నేత కార్మికులు పాల్గొన్నారు.

## తిరుపతి ధ్యానారామంలో నెల రోజుల పాటు రుద్రాభిషేకాలు



తిరుపతి, అక్టోబర్ 27:కార్తీకమాసం సందర్భంగా తిరుపతిలోని ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ధ్యానారామంలో నెలరోజుల పాటు రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయం అధికారులు వెల్లడించారు. కార్తీకమాసం సందర్భంగా నిన్నటి నుంచి ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఆవరణలోని ధ్యానారామంలో రుద్రాభిషేకం ప్రారంభమయ్యింది. ఉమామహేశ్వరస్వామి, బృహదీశ్వర స్వామివార్లకు పంచామృత అభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు.కార్తీక మాసం ముగిసే వరకు ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు జరిగే రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శివలింగానికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి తదితర పదకొండు ద్రవ్యాలతో పదకొండు సార్లు రుద్రం, నమక చమక మంత్రసహితంగా అభిషేకించారు. లఘున్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం శుభ ఫలితాలను ఇస్తుందని పండితులు తెలిపారు.

## పెద్దవంగర సెంటర్లో బిజెపి పార్టీ దిష్టిబొమ్మ దగ్ధం

మహబూబాబాద్, అక్టోబర్ 27:(నేటినిజం ప్రతినిధి): కేంద్ర బీజేపీ నాయకులు తెలంగాణ రాష్ట్ర సమితి నలుగురు ఎమ్మెల్యేలకు డబ్బులు మరియు కాంట్రాక్టులు ఇస్తామని ప్రలోభ పెట్టి బీజేపీ పార్టీలోకి రావాలని ప్రయత్నించారు.అట్టి ప్రయత్నాలకు దీనికి నిరసనగా

ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఆదేశాల మేరకు పెద్దవంగర మండల టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్ సెంటర్ వద్ద బిజెపి పార్టీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్దవంగర టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఈదురు ఐలయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బతీయటానికి ప్రయత్నించిన బీజేపీ నాయకుల తీరును పూర్తిగా ఖండిస్తున్నామని, అట్టి బీజేపీ నాయకులపై తగు విచారణ చేసి చట్ట రీత్యా చర్య తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు జాటోత్ నెహ్రూ నాయక్, తొర్రూర్ మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కేతిరెడ్డి సోమనరసింహ రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు కనుకుంట్ల వెంకన్న, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్, సర్పంచ్లు చింతల భాస్కర్, గుగులోత్ పటేల్ నాయక్, ధరావత్ భీమా, స్థానిక ఎంపీటీసీ ఎదునూరి శ్రీనివాస్, టిఆర్ఎస్ నాయకులు రెడ్డబోయిన గంగాధర్ , సలీదండి సుధాకర్, రాసాల సమ్మయ్య, డైరెక్టర్ అనపురం రవి, బోనగిరి లింగమూర్తి, మండల పార్టీ ఎస్సి సెల్ అధ్యక్షులు చిలుక బిక్షపతి, జాటోత్ కిషన్, జాటోత్ దాస్రు, కాసాని హరీష్, లింగాల రమేష్,, దంతలపెల్లి ఉపేందర్, ఎర్ర వెంకన్న, దంతలపెల్లి సాయిలు, జాటోత్ హేమని, నునవత్ బాలు,కోట అశోక్, రాంపాక నారాయణ, మొగులగాని హరీష్, సుభాష్, ఈదురు మధు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీని చెత్తకుప్పగా మార్చేసిన కాషాయ పాలకులు : కేజ్రీవాల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కాషాయ పార్టీ లక్ష్యంగా తీవ్ర విమర్శలు గుప్పించారు. యూపీలోని ఘజీపూర్ డంపింగ్ యార్డ్‌ను సందర్శించిన కేజ్రీవాల్ బీజేపీపై దుమ్మెత్తిపోశారు. బీజేపీ ఢిల్లీని మురికికూపంగా మార్చి చెత్త నింపడం మినహా రాజధానికి చేసిందేమీ లేదని, ప్రజలంతా ఈ విషయం ఆలోచించాలని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) ఎన్నికలకు ముందు ఢిల్లీలోని అతిపెద్ద డంపింగ్ యార్డ్‌లో ఒకటైన ఘజీపూర్ ప్రాంతంలోని గార్బేజ్ డంప్‌ను సందర్శించారు.

ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీజేపీ పాలనను కేజ్రీవాల్ తప్పుపడుతూ వారు ఢిల్లీలో ప్రతిచోటా చెత్తను వేయడం తప్ప కాషాయ పాలకులు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. ఘజీపూర్‌లో పేరుకుపోయిన చెత్త పర్వతాన్ని చూసేందుకు ఈరోజు తాను ఇక్కడికి వచ్చానని అన్నారు.

బీజేపీ మురికి పార్టీ అని ఆప్ స్వచ్ఛమైన పార్టీ అని ఏదో ఓ రోజు సంబిట్ పాత్రా చెబుతారని, బీజేపీ కార్యకర్తలంతా ఆప్‌లో చేరే రోజు కూడా రానుందని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. తాను మెజీషియన్ అని, ప్రజల హృదయాలను గెలుచుకోవడం ఎలాగో తనకు తెలుసునని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జీరో అయిందని, ఒకరోజు బీజేపీ కూడా జీరో కానుందని అన్నారు. ఇక ఈ ఏడాది చివరిలో లేదా వచ్చే ఏడాది ఆరంభంలో ఎంసీడీ ఎన్నికలు జరగనున్నాయి.

# కమలం పువ్వు వాడిపోవడం ఖాయం: మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



మునుగోడు, అక్టోబర్ 27: టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు పర్వంలోకి స్వామిజీలను దింపడం సిగ్గు చేటని, ఇది బీజేపీ నీచ రాజకీయాలకు పరాకాష్ట అని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ఎన్నో ప్రలోభాలు పెట్టి పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ చేసిన కుట్రలను తెలంగాణ పోలీసులు బట్టబయలు చేశారని వెల్లడించారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంపై మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ గ్రామంలో ధర్నా నిర్వహించారు. బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. మునుగోడు ఉపఎన్నికల్లో టీఆర్ఎస్‌ను గెలిపించి బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ఆ పార్టీ అభ్యర్థిని చిత్తుగా ఓడించి తెలంగాణలో బీజేపీకి స్థానం లేదని నిరూపించాలన్నారు.

హిందుత్వ పేరుతో హిందూ మత గౌరవాలను, విశ్వాసాలను బీజేపీ మంటగలిపే ప్రయత్నాలు చేస్తుందని, దీన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని చెప్పారు. ఎవరెన్ని కుట్రలు చేసినా సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ సమాజం వాటిని తిప్పికొడుతుందని వెల్లడించారు. 14 ఏండ్ల సుధీర్ఘ పోరాటం తర్వాత స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజల మనసును గెలుచుకున్నారని, మిగితా రాష్ట్రాల్లో మాదిరిగా ఇక్కడ బీజేపీ ఆకర్ష్ పని చేయదని, రానున్న రోజుల్లో కమలం పువ్వు వాడిపోవటం ఖాయమని జోస్యం చెప్పారు.

# మెదక్‌లో కేంద్ర ప్రభుత్వ,మోదీ దిష్టిబొమ్మల దహనం



మెదక్, అక్టోబర్ 27: నేటినిజం (ప్రతినిధి): అధికారపార్టీకి చెందిన టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలుకు కుట్రలు పన్నిన బీజేపీ నాయకుల వ్యవహారాన్ని వ్యతిరేకిస్తూ మెదక్ జిల్లాలో నిరసనలు వెల్లువెత్తా యి. ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పిలుపుమేరకు గురువారం జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాటాడుతూ మునుగోడు ఉప ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో అధికార పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేల కొనుగోళ్లకు బీజేపీ ప్రభుత్వం తెర తీసిందని విమర్శించారు. ప్రశాంతంగా నడుస్తున్న సర్కారును పడగొట్టాలని కుట్ర చేశారని, అందులో భాగంగానే ఒక్కో ఎమ్మెల్యేను రూ.100 కోట్లతో కొనాలని చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు చంద్రబాబు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనాలని రేవంత్ రెడ్డి ద్వారా కుట్రలు చేసి దొరికిపోయారని, ఇప్పుడు బీజేపి నేతలు అదే చేయబోయి భంగపడ్డారని ఆరోపించారు. అదాని, అంబానీలకు దేశాన్ని తాకట్టు పెట్టగా వచ్చిన సొమ్ముతో ఎమ్మెల్యేలను కొనుగోలుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు.

దేశంలో ప్రశ్నించే గొంతుకులను అణగదొక్కేందుకు కేంద్ర ప్రభుత్వం ఇలాంటి కుట్రలు చేస్తున్నదని, సీఎం కేసీఆర్ ముందు బీజేపీ కుప్పిగంతులు సాగవని హెచ్చరించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం టీఆర్ఎస్ దే అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గడ్డమీద కృష్ణ గౌడ్,మున్సిపల్ కౌన్సిలర్లు ఆర్ కె శ్రీనివాస్, సమియొద్దీన్ కిషోర్, జయరాజ్,నాయకులు రాగి అశోక్,ప్రభు రెడ్డి, శ్రీధర్ యాదవ్, మధుసూదన్ రావు, దుర్గాప్రసాద్, ప్రవీణ్ గౌడ్, అరవింద్ గౌడ్, మంగ. రమేష్ గౌడ్, మధు,శంకర్, ఆడవయ్య, ఉమర్, జుబేర్,బానీ, మహమ్మద్, నగేష్, బాలరాజు,పెరికె. కిషన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజగోపాల్‌రెడ్డి లాగా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అమ్ముడుపోరు: వేముల ప్రశాంత్ రెడ్డి




నిజామాబాద్, అక్టోబర్ 27: ప్రధాని నరేంద్ర మోడీని ఎదిరించే దమ్ము ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మాత్రమే ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం డి నాగారం గ్రామంలో స్థానిక టీఆర్ఎస్ నేతలతో కలిసి బీజేపీ దిష్టిబొమ్మను మంత్రి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ఆటలు తెలంగాణలో సాగవన్నారు. మోడీని ఎదిరించే దమ్మున్న మొనగాడు కేసీఆర్ ఒక్కరే అన్నారు.

“18వేల కోట్లకు అమ్ముడుపోయిన రాజగోపాల్ రెడ్డిలాగా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అమ్ముడుపోరు. మా ఎమ్మెల్యేలు నిఖార్సైన తెలంగాణ బిడ్డలు. బీజేపీ ప్రలోభాల కుట్రను బట్టబయలు చేసి యావత్ తెలంగాణ సమాజంలో శభాష్ అనిపించుకున్నారు. మోడీ, అమిత్ షా భారత దేశం వారి జాగీర్ అయినట్టు వ్యవహరిస్తున్నారు. కేసీఆర్ దేశ రాజకీయాల్లోకి వస్తుంటే దేశ వ్యాప్తంగా ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది. దీన్ని తట్టుకోలేక ఈ కుట్రకు పూనుకున్నారు. నలుగురు ఎమ్మెల్యేలను కొని ఇక్కడ ఏదో జరుగుతుందని తెలంగాణ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఒక్కో ఎమ్మెల్యేకు 100 కోట్లు కాంట్రాక్టులు ఇస్తామని ప్రలోభ పెట్టారన్నందుకు అన్ని ఆధారాలు ఉన్నాయి. ఇతర రాష్ట్రాల్లోని ప్రభుత్వాలను కూలదోసినట్టు తెలంగాణలో చేస్తామంటే? బిడ్డా మీ ఆటలు ఇక్కడ సాగవు. ఇది కేసీఆర్ అడ్డా” అంటూ హెచ్చరించారు.

దేశంలో మోడీ, అమిత్ షా అవినీతిని సీఎం కేసీఆర్ ఒక్కరే ప్రశ్నిస్తున్నారని మంత్రి అన్నారు. అందుకే తెలంగాణను అస్థిరపరిచేందుకు కుట్రకు తెరలేపారని మండిపడ్డారు. ప్రజల చేత ఎన్నుకోబడిన మహారాష్ట్ర, గోవా, మధ్యప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలను అక్రమంగా కూలదోశారని విమర్శించారు. కార్పొరేట్ మిత్రులకు రూ.12 లక్షల కోట్లు బ్యాంకు రుణాలు మాఫీ చేసి.. అక్రమంగా వచ్చిన సొమ్ముతో ఎమ్మెల్యేలను కొంటూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

## టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు బీజేపీ ఎరపై కర్ణాటక కాంగ్రెస్ ఫైర్

బెంగళూరు, అక్టోబర్ 27: బీజేపీ నేతల దగ్గర అక్రమ నగదు కనిపించినా వారిపై కేసులు నమోదు చేసేందుకు ఈడీకి, ఐటీకి భయం పట్టుకుందని కర్ణాటక కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తంచేసింది. తెలంగాణలో నలుగురు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు బీజేపీ డబ్బు ఎరవేసి ప్రలోభపెట్టిన ఘటనపై కే కాంగ్రెస్ స్పందించింది. తెలంగాణలో బీజేపీ చేపట్టిన ఆపరేషన్ లోటస్ సందర్భంగా పోలీసులకు రూ.15 కోట్ల నగదు లభించిందని ఆరోపించింది.

బీజేపీ ఒక్కో టీఆర్ఎస్ ఎమ్మెల్యేకు రూ.100 కోట్లు ఆఫర్ చేసినట్లు తెలిసిందని, అంటే ఇది వందల కోట్ల వ్యవహారమని, అయినా ఈడీ, ఐటీ అధికారులు ఈ ఘటనపై ఎందుకు ఇప్పటివరకు కేసులు నమోదు చేయలేదని కే కాంగ్రెస్ ప్రశ్నించింది. బీజేపీ నేతల ఇళ్లలో సోదాలు చేయాలంటే ఈడీ, ఐటీ అధికారులకు భయమా? అని కేటీపీసీసీ ట్విట్టర్ ద్వారా ప్రశ్నించింది.

## పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లా పోలీసుల సైకిల్ ర్యాలీ..!!!

-- జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన జిల్లా ఎస్పీ యం. రమణ కుమార్.



సంగారెడ్డి అక్టోబర్ 27(నేటి నిజం ప్రతినిధి) పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాలలో భాగంగా శుక్రవారము నాడు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో గల పోలీస్ అమరవీరుల స్థూపం నుండి స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుండి ఐ.బి వరకు నిర్వహించిన సైకిల్ ర్యాలీని జిల్లా ఎస్పీ రమణ కుమార్ ప్రారంభించారు. సైకిల్ తొక్కుతూ అందరిని ఉత్సాహ పరిచారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజా రక్షణలో, శాంతి భద్రతల పరిరక్షణలో నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ, ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ముందుకు సాగుతున్న పోలీసుల కృషి అభినందనీయమని అన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజా క్షేమం కోసం పని చేస్తూ అమరులైన వారి త్యాగాలను స్మరించుకునేలా ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహిస్తున్నామని అయన చెప్పారు. అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలతో మరింత మమేకం అవుతూ ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన అన్నారు.

ఈ ర్యాలీలో జిల్లా పోలీసులతో పాటు ప్రజలు ముఖ్యంగా స్కూలు విద్యార్థిని, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సైకిల్ ర్యాలీను పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉషావిశ్వనాథ్ , రవీంద్రారెడ్డి డియస్పి సంగారెడ్డి, శివలింగం ఇన్స్ పెక్టర్స్ సంగారెడ్డి రూరల్, యస్.బి. ఇన్స్ పెక్టర్స్ మహేష్ గౌడ్, ఆర్.ఐ.లు కృష్ణ, డానియెల్, యస్.బి. యస్.ఐ. యాదవరెడ్డి మరియు సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

## ఖతార్‌లో భారత మాజీ నౌకాదళాధికారుల నిర్బంధం

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: భారత్‌కు చెందిన పలువురు నౌకాదళ రిటైర్డ్ అధికారులను ఖతార్‌లో అదుపులోకి తీసుకున్నారు. వీరిని ఎందుకు నిర్బంధించారనే దానికి కారణాలు తెలియరాలేదు. వీరిని అక్రమంగా నిర్బంధించారని మితు భార్గవ అనే మహిళ ట్విట్టర్ వేదిక ద్వారా వెల్లడించింది. వీరిలో ఒకరు రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకున్నారు.

ఖతార్‌లోని దోహాలో ఎనిమిది మంది రిటైర్డ్ ఇండియన్ నేవీ అధికారులను అదుపులోకి తీసుకున్నారు. అయితే వీరిని అదుపులోకి తీసుకున్న కారణం మాత్రం అక్కడి ప్రభుత్వం వెల్లడించలేదు. ఖతార్ ఎమిరీ నేవీకి శిక్షణ, ఇతర సేవలను అందించే కంపెనీలో ఈ రిటైర్డ్ అధికారులు పనిచేస్తున్నట్లుగా తెలుస్తున్నది.

వీరి నిర్బంధం విషయం దోహాలోని భారత రాయబార కార్యాలయానికి తెలుసునని, వీరిని అదుపులోకి తీసుకుని ఇవాల్టికి 57 రోజులు అవుతుందని డాక్టర్ మీతూ భార్గవ ట్విట్టర్ ద్వారా తెలిపారు.

ఓ ఆంగ్ల దినపత్రిక కథనం ప్రకారం, మాజీ నౌకాదళ అధికారులు దహ్రా గ్లోబల్ టెక్నాలజీస్ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ కంపెనీలో పనిచేసేవారు. ఈ కంపెనీ ఖతార్ డిఫెన్స్, ఇతర భద్రతా ఏజెన్సీలకు స్థానిక వ్యాపార భాగస్వామిగా ఉన్నది. రక్షణ పరికరాల నిర్వహణ చూస్తున్నది. ఈ కంపెనీ సీఈవో ఖమీస్ అల్ అజ్మిక్ రాయల్ ఒమన్ ఎయిర్ ఫోర్స్ స్క్వాడ్రన్ లీడర్‌గా రిటైరయ్యారు. అయితే, ఈ రిటైర్డ్ అధికారులను ఎందుకు నిర్బంధంలోకి తీసుకున్నారనే విషయం ఇంతవరకు ఈ కంపెనీ వెల్లడించలేదు.

# ఎన్ని కుట్రలు పన్నినా టీఆర్ఎస్ ఓటమి తథ్యం.



మహబూబాబాద్, అక్టోబర్ 27:(నేటినిజం ప్రతినిధి): మునుగోడు ఉప ఎన్నికల్లో గెలవడం కోసమే కేసీఆర్ డైరెక్షన్ లో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొనుగోలు డ్రామాలు ఆడుతున్నారని, కేసీఆర్ కు చిత్తశుద్ధి ఉంటే ఈ ఘటనపై ప్రభుత్వం సీబీఐ విచారణ జరిపించాలని,నిజానిజాలు నిగ్గు తేల్చాలని బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి పెదగాని సోమయ్య డిమాండ్ చేశారు.మునుగోడు ప్రజలు కేసీఆర్ పై, టీఆర్ఎస్ పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తుండడంతో కేసిఆర్ డైరెక్షన్లో నలుగురు ఎమ్మెల్యేలు కొనుగోలు డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు.నలుగురు ఎమ్మెల్యే లు ఉన్న ఫామ్ హౌస్ టీఆర్ఎస్ నేతలది, ఫిర్యాదు చేసింది టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అని, డబ్బు సంచి ఉన్న వాహనం టీఆర్ఎస్ ఎమ్మెల్యే అనుచరుడిది అని, అక్కడ అరెస్టు అయింది టీఆర్ఎస్ ఎమ్మెల్యే స్నేహితులు,సన్నిహితులు,గురువులు అని నింద మాత్రం బీజేపీ పై అని తెలిపారు.

ఈవ్యవహారం మొత్తం కథ, స్క్రీన్ ప్లే దర్శకత్వం కేసీఆర్, కేటీఆర్ అని తెలిపారు.డ్రామా మొత్తం అట్టర్ ఫ్లాప్ అయ్యింది అని ప్రజలెవరూ ఈ డ్రామాను నమ్మడం లేదని ప్రజలంతా కేసీఆర్ కుట్రలు చూసి నవ్వుకుంటున్నారని తెలిపారు.మునుగోడు ప్రజలంతా ధర్మబద్ధంగా పోరాటం చేస్తున్న బీజేపీకి మద్దతుగా ఉన్నారని, మునుగోడులో టీఆర్ఎస్ ఓటమి తథ్యం అని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ తొర్రూరు మండల అధ్యక్షుడు పల్లె కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్, జిల్లా నాయకులు రంగు రాములు, రాం మోహన్ రెడ్డి,పూసాల శ్రీమాన్,జలగం వెంకన్న,తళారి సోమయ్య, బొచ్చు సురేష్,బొమ్మనబోయిన సుధాకర్,ఉడుత శ్యాం,అల్లం సాయి, దాసరి మురళి తదితరులు పాల్గొన్నారు.

అరసం కథా స్రవంతి
10 కథా సంపుటాల ఆవిష్కరణ



1. కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు
2. తాళ్లూరు నాగేశ్వరరావు కథలు
3. శశిశ్రీ కథలు
4. శాంతి నారాయణ కథలు
5. పెద్దింటి అశోక్‌కుమార్ కథలు
6. బలివాడ కాంతారావు కథలు
7. సతీష్ చందర్ కథలు
8. కరుణకుమార కథలు
9. వి.ఆర్.రాసాని కథలు
10. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి కథలు

పది పుస్తకాల సెట్ ధర రూ. 670/-
ఆవిష్కరణ సందర్భంగా సెట్ రూ. 550/- మాత్రమే

తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం మరియు
తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంయుక్త ఆధ్వర్యంలో
కథా స్రవంతి సంపుటాల ఆవిష్కరణ సభ

సభాధ్యక్షులు : డా॥ రాపోలు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అరసం
ముఖ్య అతిథి & ఆవిష్కర్త : ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, పూర్వ ఉపాధ్యక్షులు, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
గౌరవ అతిథి : శ్రీ జూలూరు గౌరీశంకర్, అధ్యక్షులు, తెలంగాణ సాహిత్య అకాడమీ
విశిష్ట అతిథి : డా॥ ఏనుగు నరసింహారెడ్డి, అదనపు కలెక్టర్, మేడ్చల్ జిల్లా
ఆత్మీయ అతిథులు : డా॥ మామిడి హరికృష్ణ, సంచాలకులు, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ
పుస్తకాల పరిచయం : శ్రీ కె.పి.అశోక్ కుమార్, ప్రముఖ విమర్శకులు
ప్రత్యేక అతిథులు : శ్రీ సతీష్ చందర్, ప్రముఖ కవి, కథా రచయిత
శ్రీ పెద్దింటి అశోక్ కుమార్, ప్రముఖ కథా రచయిత
ప్రధాన సంపాదకులు : శ్రీ వల్లూరు శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి, ఆం.ప్ర. అరసం
వేదిక : రవీంద్రభారతి (మినీహాలు, మొదటి అంతస్థు), హైదరాబాదు
తేది & సమయం : తేది: 5-11-2022, శనివారం, సా॥ 6 గం॥లకు

అందరూ ఆహ్వానితులే

డా॥ పల్లేరు వీరాస్వామి
కార్యనిర్వాహక కార్యదర్శి, తెలంగాణ అరసం
9441779688

# మునుగోడు ఓటమి భయంతోనే ఎమ్మెల్యేలను కొనేందుకు స్కెచ్: మంత్రి శ్రీనివాస్ గౌడ్



చౌటుప్పల్, అక్టోబర్ 27: మునుగోడులో ఓడిపోతామనే భయంతో అధికార పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేల కొనుగోళ్లకు బీజేపీ నాయకులు తెర తీశారని మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ప్రశాంతంగా నడుస్తున్న సర్కారును పడగొట్టాలని కుట్ర చేశారని, అందులో భాగంగానే ఒక్కో ఎమ్మెల్యేను రూ.100 కోట్లతో కొనాలని చూశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజగోపాల్ రెడ్డి లా తమ ఎమ్మెల్యేలు అమ్ముడుపోరని స్పష్టం చేశారు. మునుగోడు ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు కుట్రలు చేసిన బీజేపీ నేతల తీరును నిరసిస్తూ నల్ల చొక్కా ధరించి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అప్పుడు చంద్రబాబు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనాలని రేవంత్ రెడ్డి ద్వారా కుట్రలు చేసి దొరికిపోయారని, ఇప్పుడు బీజేపి నేతలు అదే చేయబోరని విమర్శించారు. మోదీ కూడా అచ్చం చంద్రబాబులానే రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేందుకు ప్రయత్నించి పట్టుబడ్డారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒక్కో ఎమ్మెల్యే కు రూ. 100 కోట్లు ఇచ్చి కొనుగోలు చేయాలని చేసిన కుట్ర బట్టబయలు అవడంతో బీజేపీ నీచ రాజకీయం తేటతెల్లం అయ్యిందని తెలిపారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని బీజేపీ కొనుగోలు చేసినట్లు తమ ఎమ్మెల్యేలను ఎవరూ కొనలేరని మంత్రి పేర్కొన్నారు.

అదాని, అంబానీలకు దేశాన్ని తాకట్టుపెట్టగా వచ్చిన సొమ్ముతో ఇలా ఎమ్మెల్యేలను కొనే కుట్రలు చేస్తున్నారని ఫైరయ్యారు. దేశంలో ప్రశ్నించే గొంతుకులను అణగదొక్కేందుకు కేంద్ర ప్రభుత్వం ఇలాంటి కుట్రలు చేస్తున్నదని.. సీఎం కేసీఆర్ ముందు బీజేపీ కుప్పిగంతులు సాగవని అన్నారు.

దేవుళ్ల పేరిట యువతను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నా.. బీజేపీ నేతల బండారం బట్టబయలుకావడంతో వారు ఆ పార్టీకి దూరమవుతున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 70 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్న సర్కారు తమదని స్పష్టం చేశారు. ఆసరా పింఛన్లతో వృద్ధుల్లో భరోసా లభించిందన్నారు. తెలంగాణ వచ్చాక కరువు అనేదే లేదని అన్నం పెట్టే ప్రభుత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోవద్దని మంత్రి కోరారు.

# తుపాకి రెండు బుల్లెట్లు స్వాధీనం జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డ్




రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 27: (నేటినిజం ప్రతినిధి): కోనరావుపేట మండలం బావు సాయి పేట గ్రామానికి చెందిన నేవూరి నర్సయ్య అనే జనశక్తి మాజీ మిలిటెంట్ వద్ద నుండి గురువారం తుపాకీ రెండు బుల్లెట్లను స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు పూర్తి వివరాల్లోకి వెళితే .. నేవూరి నర్సయ్య గతంలో జనశక్తి మాజీ మిలిటెంట్ గా పనిచేసిన కాలంలో జనశక్తి నాయకులు అతనికి ఒక తపంచా బుల్లెట్లను ఇవ్వడం జరిగిందని దాన్ని చాలా కాలంగా దాచిపెట్టడం జరిగిందని ఈ మధ్యకాలంలో నరసయ్య భార్య మృతిచెందగా దినకర్మలు చేసే క్రమంలో కొడుకుతో గొడవలు జరిగాయని దాంతో ఎలాగైనా కొడుకు తన మాట వినడం లేదని కోపంతో పొలం పొద్ద దాచిపెట్టిన తపంచాను చూపెట్టి చంపేస్తానని బెదిరించాడని దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నేవూరు నరసయ్యను అరెస్టు చేసి అతని వద్ద నుండి ఒక తపంచా రెండు 8 ఎంఎం బుల్లెట్లను స్వాధీనం చేసుకొని అతన్ని రిమాండ్ కు తరలించడం జరిగిందని ఎస్పీ తెలిపారు . గతంలో జనశక్తి నిషేధిత పార్టీలో పని చేసిన వారి వద్ద ఏవైనా ఆయుధాలు కలిగి ఉన్నట్లయితే వాటిని వెంటనే ఆయా పరిధిలోని పోలీస్ స్టేషన్లో అప్పగించగలరని లేనియెడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు . ఈ కేసులో నిందితున్ని పట్టుకున్న కోనరావుపేట ఎస్సై రమాకాంత్ ఎస్ఐ శ్రీనివాస్ కానిస్టేబుల్ నాగరాజు సిబ్బందిని ఎస్పీ అభినందించారు .

# బగ్దాద్ యాత్రకు వెళుతున్న గులాం అహ్మద్ హుస్సేన్.. హఫీజ్ యూసుఫ్ లకు ఆత్మీయ సన్మానం




కరీంనగర్, అక్టోబర్ 27 (నేటినిజం ప్రతినిధి): ఇరాక్ రాజధాని బగ్దాద్ నగరంలో సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలాని రహమతుల్లాలై (గౌసేపాక్) సమాధిని సందర్శించేందుకు వెళుతున్న ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, ఎంఐఎం పార్టీ జాయింట్ సెక్రెటరీ, సున్నీ మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు హఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్ లను కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఎంఐఎం పార్టీ శ్రేణులు, నగర కార్యవర్గం, కార్పొరేటర్లు కలిసి పూలమాలలు శాలువాలతో ఆత్మీయంగా సన్మానించారు. బగ్దాద్ పర్యటన సజావుగా జరిగి విజయవంతంగా తిరిగి రావాలని ఎంఐఎం శ్రేణులు ఆకాంక్షించారు. బగ్దాద్ పర్యటన విజయవంతం కోసం ప్రార్ధనలు చేయాలని ఎంఐఎం శ్రేణులను, కార్యకర్తలను గులాం అహ్మద్ హుస్సేన్ కోరారు. సన్మానించిన వారిలో బొమ్మకల్ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, ఎంఐఎం కార్పొరేటర్లు బర్కత్ అలీ, ఫిరోజ్ అఖీల్, శర్ఫుద్దీన్, ఆతిన, అలిబాబా, అజర్ దబీర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల అధ్యక్షులు యునూస్ నదీమ్, ఇమ్రాన్ అడ్వకేట్, కౌన్సిలర్ రజియోద్దీన్, నాయకులు సాజిద్ బాండ్, కరింఖాన్, ఖాలీద్, ఫైసల్, అహ్మద్, రాశేద్ ఖాన్, మాసూమ్ ఖాన్, శోభి, కలీమ్, ఇమ్రాన్, సులేమాన్ మన్సూర్ తవక్కలి తదితరులు ఉన్నారు.

# రాబోయే ఎన్నికల్లో మున్నూరుకాపుకులబాంధువులు తమ సత్తా చాటాలి

## -మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 27: (నేటినిజం ప్రతినిధి): రాబోయే ఎన్నికల్లో మున్నూరు కాపు కుల బంధువులు రాష్ట్ర వ్యాప్తంగా తమ సత్తా చాటాలని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పిలుపు నిచ్చారు.

తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కొండ దేవయ్య ఆధ్వర్యంలో బుధవారం వేములవాడ పట్టణంలో జిల్లా స్థాయి మండల స్థాయి అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరుకాపు సమాజ నిర్మాణానికి యావత్ రాష్ట్ర కులభాంధవులు తోడ్పాటు పడాల్సిన అవసరం ఉందని అన్నారు . ఇందులో భాగంగా విద్యార్థి విభాగం, మహిళ విభాగం, వ్యాపార విభాగం, రైతు విభాగం, ఉద్యోగ విభాగాలుగా నిర్మాణం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే కమిటీ విభాగాల పట్టణ, మండల నిర్వాహకులుగా ముప్పిడి శ్రీనివాస్, తొగరి కరుణాకర్, మారం శ్రీనివాస్, కూరగాయల కొమురయ్య, రూరల్ నిర్వాహకులుగా గోలి తిరుపతి, శ్రీనివాస్ లను నియమించి నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య తెలిపారు. అలాగే రానున్న ఎన్నికల్లో మున్నూరుకాపు కుల భాందవులు రాష్ట్ర వ్యాప్తంగా తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కమిటీ నియమకాలు ఏర్పడిన తరువాత దాదాపు 20 వేల మంది కుల భాందవులతో భారీ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 24 శాతం ఉన్న మున్నూరుకాపు కుల భాందవులతో రాజకీయాన్ని శాసించే శక్తిగా మారాలని హితవు పలికారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని చిలుక రమేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, చిలుక రమేష్, లైశెట్టి మల్లేశం, వంగల శ్రీనివాస్, మారం కుమార్, గోపు బాలరాజు, క్రాంతి కుమార్, తదితర కుల సభ్యులు పాల్గొన్నారు.

# పెద్దకర్మకు హాజరైన జర్నలిస్టులు



ఖమ్మం, అక్టోబర్ 27 (నేటినిజం ప్రతినిధి) :ఖమ్మం నగరంలో జర్నలిస్ట్ జక్కుల వెంకటరమణ మాతృమూర్తి జక్కుల రాధ సులోచన ఇటీవలే మృతి చెందింది. ఈ సందర్భంగా గురువారం ఖమ్మం ఐఎంఏ ఫంక్షన్ హాల్ లో వారి కుటుంబ సభ్యులు ఏర్పాటుచేసిన దశదిన కర్మ కార్యక్రమంలో జర్నలిస్టులు బండి కుమార్, ఎస్ కె. యాకుబ్ పాషా, బట్టు రమేష్, హాజరై వారి చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి కలగాలని కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యాన్ని నింపి ఆ దేవుని ప్రార్థించారు.

# ఆటకు వేళాయె...!




- పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు
- నేటి నుంచి కబడ్డీ, వాలీబాల్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్
- ఖమ్మం సర్దార్ పటేల్, కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో పోటీలు

ఖమ్మం, అక్టోబర్ 27: (నేటినిజం ప్రతినిధి): మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో డే అండ్ నైట్ కబడ్డీ పోటీలు, కొత్తగూడెంలోని ప్రకాశం మైదానంలో వాలీబాల్ పోటీలు జరుగుతాయి. కబడ్డీ పోటీలు 28 నుంచి 30వ తేదీ వరకు, వాలీబాల్ పోటీలు 28 నుంచి 31వ తేదీ వరకు జరగనున్నాయి. పోటీలకు హాజరయ్యే క్రీడాకారుల కోసం ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించినట్లు ట్రస్ట్ బాధ్యులు తెలిపారు. పురుషులు, మహిళా విభాగాల్లో కబడ్డీ, జూనియర్స్ బాలబాలికలకు వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారు. కబడ్డీ విజేతకు రూ. లక్ష మొదటి బహుమతిగా అందజేస్తారు. ఈ టోర్నికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

# చలి ఎఫెక్టతో తగ్గుతున్న విద్యుత్ డిమాండ్..

హైదరాబాద్, అక్టోబర్ 27:ఓవైపు వర్షాలు కురుస్తునే ఉన్నాయి. మరోవైపు చలితీవ్రత పెరిగింది. నగరవాసులను చలి వణికిస్తుంది. 19 నుంచి 22 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడంతోపాటు ఇళ్ళల్లో, కార్యాలయాల్లో ఫ్యాన్ లేనిదే ఉండలేని పరిస్థితి ఉన్నది. గత వారం వరకు నగరంలో ఎక్కడో ఒక చోట వర్షం పడుతూనే ఉన్నది. ఈ పరిస్థితుల్లో అనూహ్యంగా గత 3రోజులుగా వాతావరణంలో మార్పు వచ్చింది, 19 నుంచి 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా 15 డిగ్రీలక నిష్టానికి చేరుకుంది. దీనితో చలి తీవ్రత పెరిగింది. తగ్గుతున్న ఉష్ణోగ్రతలతో చలి పెరిగిన ప్రభావం విద్యుత్ డిమాండ్‌పై పడింది. గత నాలుగైదు రోజుల క్రితం వరకు గ్రేటర్ పరిధిలో విద్యుత్ వినియోగం 55 మిలియన్ యూనిట్ల నుంచి 45 మిలియన్ యూనిట్లకు పడిపోయింది.

హైదరాబాద్ మహా నగరంలో గత మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో నగర వాసులను చలి వణికిస్తుంది. దీని ప్రభావంతో గత నాలుగైదు రోజుల వరకు ఉక్కపోతతో ఫ్యాన్ లేనిదే ఉండలేని వారు ప్రస్తుతం ఫ్యాన్‌ను నడిపించక పోవడం, కార్యాలయాలలో ఏసీల వాడకం తగ్గిపోవడం, ఐటీ కారిడాంలో కూడా ఏసీల వాడకం తగ్గిపోవడంతో విద్యుత్ డిమాండ్ ఒక్కసారిగా 20 నుంచి 25శాతం ఈ నెల 21 తేదీన హైదరాబాద్‌లో విద్యుత్ వినియోగం 55 మిలియన్ యూనిట్లు ఉండగా, 25వ తేదీన అది 45 మిలియన్ యూనిట్లకు పడిపోయింది. హైదరాబాద్ నగరంలో సాధారణ ఉష్ణోగ్రతలు 19 నుంచి 22 డిగ్రీలుగా ఉంటుంది. అయితే అది గత మూడు రోజులుగా 15 డిగ్రీల కనిష్టానికి పడిపోయింది. దీనితో ఫ్యాన్లు, ఏసీలు, కూలర్ల వాడకం తగ్గి పోవడంతో విద్యుత్ డిమాండ్ పడిపోయింది. గ్రేటర్ హైదరాబాద్‌లో 53 లక్షలకు పైగా గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో విద్యుత్ డిమాండ్ భారీగా పడిపోయింది. హైదరాబాద్ పరిసర జిల్లాలు మెదక్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో కూడా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. దీని ప్రభావం హైదరాబాద్ సిటిపై ఉన్నది.

# రైల్వే స్టేషన్ వద్ద కలకలం

శ్రీనగర్, అక్టోబర్ 27:జమ్మూ రైల్వే స్టేషన్ వద్ద కలకలం రేపింది. డిటోనేటర్లు, వైర్లతో కూడిన బ్యాగ్ టాక్సీ స్టాండ్‌లో లభించింది. ఆ బ్యాగ్‌లోని రెండు బాక్సుల్లో పేలుడు పదార్థాలు ఉన్నాయని జమ్ముకశ్మీర్ పోలీసులు తెలిపారు. 18 డిటోనేటర్లు, వైర్లతో ఉన్న ఆ బాక్సులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. జమ్మూ రైల్వే స్టేషన్‌లోని టాక్సీ స్టాండ్ వద్ద అనుమానిత బ్యాగ్‌ని స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీకి చెందిన సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్పీ) ఆరిఫ్ రిషు తెలిపారు. ఆ బ్యాగ్‌లోని రెండు బాక్సుల్లో ప్యాక్ చేసిన పేలుడు పదార్థాలు ఉన్నాయని చెప్పారు.

18 డిటోనేటర్లు, కొన్ని వైర్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఆ బాక్స్‌లో దాదాపు 500 గ్రాముల మైనపు పదార్థం ప్యాక్ చేసి ఉందన్నారు. వీటినీ స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.కాగా, జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో జమ్మూ రైల్వే స్టేషన్ వద్ద డిటోనేటర్లతో కూడిన బ్యాగ్ లభించడం స్థానికంగా కలకలం రేపింది. ఉగ్రవాదులు ఇటీవల పౌరులను, ముఖ్యంగా కశ్మీర్ పండిట్లను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఈ నెల 15న షోపియాన్ జిల్లాలోని చౌదరి గుండ్‌లో కశ్మీరీ పండిట్ పురాణ్ క్రిషన్‌పై కాల్పులు జరిపి హత్య చేశారు. అలాగే ఈ నెల 18న హర్మెన్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఉత్తరప్రదేశ్ కన్నౌజ్‌కు చెందిన ఇద్దరు కూలీలు ఉగ్రవాదుల దాడిలో మరణించారు.

# పోలీస్ స్టేషన్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని సందర్శించిన సీపీ




ఖమ్మం, అక్టోబర్ 27: (నేటనిజం ప్రతినిధి): నేరాల నియంత్రణకు పోలీస్ గస్తీ మరింత ముమ్మరం చేయాలని పోలీస్ కమిషనర్ విష్ణు యస్.వారియర్ పోలీస్ అధికారులకు ఆదేశించారు.

గురువారం కామేపల్లి, కారేపల్లి పోలీస్ స్టేషన్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని పోలీస్ కమిషనర్ సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ..పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులతో మర్యాదగా మెలగాలని, ప్రతిఒక్కరికి జవాబుదారీగా వుండాలని సూచించారు.

రిసెప్షన్ సిబ్బంది విధులు ఏవిధంగా నిర్వర్తిస్తున్నారో వివరాలు తెలుసుకున్నారు. రిసెప్షన్ రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ లో నిర్వహిస్తున్న ఫంక్షనల్ వర్టీకల్స్ ను సమీక్షించారు.

5ఎస్ అమలులో భాగంగా పోలీస్ స్టేషన్లలో స్టేషనరీ విభాగం పరిశుభ్రంగా వుంచాలని అదేవిధంగా అవసరమైన రికార్డులు, వస్తువుల క్రమపద్ధతిలో పెట్టడం, పరిసరాలలో సురక్షితమైన ,ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు.

అప్పగించిన భాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. స్టేషన్ హౌస్ మేనేజ్‌మెంట్, పోలీస్ స్టేషన్ నిర్వహణ, యూనిఫాం మరియు రెగ్యులర్ రోల్ కాల్ మరియు వీక్లీ పరేడ్ గురించి సిబ్బంది అధికారులు విధిగా అమలు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ లోని రికార్డులను పరిశీలించారు. పెట్రో కార్ సిబ్బంది ఏవిధమైన విధులు నిర్వహిస్తున్నారు.? బీట్ డ్యూటీ సిబ్బంది ట్యాబ్ ద్వారా క్రైమ్ ప్రో ఏరియాను ఏవిధంగా గుర్తిస్తున్నారు.? జియో ట్యాగ్ ద్వారా పాత నేరస్థుల నివాసాలను కదలికలను ఏవిధంగా గుర్తిస్తున్నారో ట్యాబ్ ద్వారా చూపించాలని ఆదేశించారు. స్టేషన్ ఆవరణను పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ ను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కమ్యూనిటీ పోలిసింగ్ లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం ద్వారా కలిగే ఉపయోగాలను స్థానికులు వివరించి స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు పెట్టుకొనే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఆనంతరం పోలీస్ స్టేషన్ అవరణలో మొక్కలు నాటారు.

# సాంకేతికతలలో పది వేల మంది గ్రామీణ మహిళలను నైపుణ్యం చేసేందుకు ఎస్రీ ఇండియా కృషి

హైదరాబాద్, అక్టోబర్ 27:"గ్లోబల్ విలేజ్‌ని జియో-ఎనేబుల్ చేయడం: ఎవరూ వెనుకబడి ఉండకూడదు" అనే థీమ్‌తో, గ్లోబల్ జియోస్పేషియల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్‌పై ఐక్యరాజ్యసమితి నిపుణుల కమిటీ ( రెండవ ఐక్యరాజ్యసమితి ప్రపంచాన్ని సమావేశపరిచింది. 10-14 అక్టోబర్ 2022 నుండి భారతదేశంలోని హైదరాబాద్‌లో జియోస్పేషియల్ ఇన్ఫర్మేషన్ కాంగ్రెస్

ఒక దశాబ్దానికి పైగా, స్థిరమైన అభివృద్ధి యొక్క సంక్లిష్ట సవాళ్లను పరిష్కరించడంలో ఐక్యరాజ్యసమితి, జాతీయ ప్రభుత్వాలకు సహాయం చేయడంలో ఎస్రీ ముందంజలో ఉన్నారు. సుస్థిర అభివృద్ధి ఎజెండాకు మద్దతుగా, దేశంలోని ప్రముఖ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ సాఫ్ట్‌వేర్, సొల్యూషన్స్ ప్రొవైడర్ అయిన ఎస్రీ ఇండియా, భూ-కౌశల్ (మహిళా సాధికారత, విద్య కోసం ఎస్రీ ఇండియా-అకాడమీ సంయుక్త చొరవ) మేరా గావ్ అనే రెండు క్లిష్టమైన కార్యక్రమాలను ప్రదర్శించింది. హమారా జల్ (ఎస్రీ ఇండియా - అమృత విశ్వ విద్యాలయం జియోస్పేషియల్ ద్వారా కమ్యూనిటీ పునరుద్ధరణను బలోపేతం చేయడానికి ఉమ్మడి చొరవ). కార్యక్రమాలు ప్రదర్శించబడ్డాయి.

భారత ప్రభుత్వంలోని సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్, డివిజన్, సీడ్, సలహాదారు, హెడ్ డాక్టర్ దేబప్రియ దత్తా మాట్లాడుతూ, 2022లో జి-చౌపల్ ఒక ప్రత్యేకమైన చొరవ, దీని ద్వారా మేము జియో-ఎనేబుల్‌మెంట్ చర్చలను బయటికి తీసుకువచ్చాము. సమావేశం యొక్క నాలుగు గోడలు. నిజమైన వాటాదారుల ఈ ప్రదర్శన 'గ్లోబల్ విలేజ్‌ని జియో-ఎనేబుల్ చేయడం: ఎవరూ వెనుకబడి ఉండకూడదు' అనేదానికి నిదర్శనం.

ఎస్రీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అగేంద్ర కుమార్ మాట్లాడుతూ, "గ్రహాన్ని రక్షించడానికి రాబోయే సంవత్సరాలు చాలా ముఖ్యమైనవి, ఇది స్థిరమైన, సమగ్రమైన సమానమైన అభివృద్ధిని సాధించే మన సామర్థ్యంపై చాలా ఆధారపడి ఉంటుంది. ఆర్థిక వృద్ధికి సంబంధించిన విధానం పర్యావరణ సుస్థిరత సామాజిక స్థిరత్వంతో పాటు ఆర్థిక స్థిరత్వానికి సమాన ప్రాముఖ్యత ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. డా. పీయూష్ గుప్తా, అకాడెమీ చీఫ్ కన్సల్టెంట్, "అకాడమీ గ్రామీణ మహిళలకు జియోస్పేషియల్ టెక్నాలజీలో అవగాహన కల్పించడంలో ఎస్రీ ఇండియాతో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు . మా కేంద్రాలు (విలేజ్ లెవెల్ ఎంటర్‌ప్రెన్యూర్స్) నెట్‌వర్క్ ద్వారా, భూ-కౌశల్‌ను ప్రతి మూలకు తీసుకెళ్లడమే మా ప్రయత్నం. భారతదేశం మన గ్రామీణ పర్యావరణ వ్యవస్థలను బలోపేతం చేయడానికి ప్రాదేశిక నైపుణ్యాలతో గ్రామీణ మహిళలకు సాధికారత కల్పించండి''. అమృత విశ్వ విద్యాపీఠం సస్టైనబుల్ ఇన్నోవేషన్ అండ్ డెవలప్‌మెంట్ కోసం యునెస్కో చైర్ ఆన్ ఎక్స్‌పీరియన్షియల్ లెర్నింగ్ అండ్ ప్రోవోస్ట్ డాక్టర్ మనీషా వి రమేష్ మాట్లాడుతూ, "మేరా గావ్, హమారా జల్ చొరవ ద్వారా, భారతదేశంలోని 14 రాష్ట్రాల్లో ప్రస్తుత ఉనికిని కలిగి ఉంది, అమృత విశ్వ విద్యాపీఠం యొక్క సస్టైనబుల్ స్కూల్ డెవలప్‌మెంట్ మరియు యునెస్కో చైర్ ఆన్ ఎక్స్‌పీరియన్షియల్ లెర్నింగ్ ఫర్ సస్టైయినబుల్ ఇన్నోవేషన్ అండ్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా ఎస్రీ ఇండియాతో కలిసి నీటిని నాది కాకుండా మాది అని భావించే విధంగా సమాజంలో పరివర్తనాత్మక మార్పును తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. సుస్థిరత సవాళ్లను ఎదుర్కోవడానికి మరియు కమ్యూనిటీల సాధికారత కోసం జియోస్పేషియల్ టెక్నాలజీలను ఉపయోగించుకోవాలని అన్నారు.

# 50 శాతం పైగా తగ్గిన మెటా లాభాలు : మెటావర్స్‌పై తగ్గేది లేదన్న జుకర్‌బర్గ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: ప్రకటనల రాబడి తగ్గిపోవడంతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, వాట్సాప్‌లను నిర్వహించే టెక్ దిగ్గజం మెటా లాభాలు 50 శాతం పైగా పతనమయ్యాయి. ఈ ఏడాది మూడో క్వార్టర్‌కు కంపెనీ ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రకటనల రాబడి, ఆదాయం గణనీ ఓయంగా తగ్గడంతో నాలుగో క్వార్టర్‌లోనూ నిరాశజనకమైన ఫలితాలే ఉంటాయని అంచనా వేస్తున్నట్టు కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ ఏడాది నాలుగో క్వార్టర్‌లో మొత్తం రాబడి 30-32.5 బిలియన్ డాలర్ల మధ్య ఉంటుందని అంచనా వేస్తున్నామని తెలిపింది.మెటా ఫలితాలపై స్టాక్ మార్కెట్ ప్రతికూలంగా స్పందించింది. కంపెనీ షేర్లు ఏకంగా 20 శాతం పడిపోవడంతో మెటా మార్కెట్ క్యాపిటలైజేషన్ 6700 కోట్ల డాలర్ల మేరకు తుడిచిపెట్టుకుపోయింది. గూగుల్ వంటి ఇతర టెక్ దిగ్గజాల తరహాలోనే ప్రతికూల ఆర్థిక పరిస్థితులు ప్రకటనల రాబడి మందగించడానికి దారితీయడంతో మెటా ఇబ్బందులకు లోనైంది. ఇదే సమయంలో కంపెనీ పెద్ద ఎత్తున వనరులు, సమయాన్ని మెటావర్స్‌పై వెచ్చించింది. ఇంటర్‌నెట్ భవితవ్యంగా మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ మెటావర్స్‌పై విశ్వాసం ఉంచారు. మెటావర్స్ ప్రణాళికలపై వెనక్కితగ్గేది లేదని కంపెనీ స్పష్టం చేసింది. మెటా సేవలను వాడే యూజర్ల సంఖ్య పెరుగుతోందని మార్క్ జుకర్‌బర్గ్ వివరించారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.